# ఖూనీ

## నాటకం



"కవిరాజు"
త్రిపురనేని రామస్వామి

# ఖూనీ

సృజనకర్త
**కవిరాజు త్రిపురనేని రామస్వామి**

మన మాటల్లో
**రావెల సాంబశివరావు**

**ఖూనీ**

నాటకం

సృజనకర్త: కవిరాజు త్రిపురనేని రామస్వామి

మన మాటల్లో
రావెల సాంబశివరావు

ప్రచురణ కాలం: 15 జనవరి 2014

ప్రచురణకర్తలు:
త్రిపుర ప్రచురణలు
email: anil@anilatluri.com

డి.టి.పి. & లేఅవుట్:
శ్రీశ్రీ ప్రింటర్స్
మసీదుకి ఎదురుగా, అరండాల్‌పేట
విజయవాడ –2
ఫోన్: 9490634849

వెల: రూ. 60/–

eBook: www.kinige.com

# మనవి

కవిరాజుకు నూటపాతికేళ్లు నిండాయి. ఆయన రచనలకు నూరేళ్లు వస్తున్నాయి; కొన్ని చదువుదామన్నా దొరకటం లేదు - దొరికినవి అర్థంకావటంలేదు; అని భావించే వాళ్లు ఎదురవుతున్నారు. అటువంటి వారికోసమే యిటువంటి రచన.

అప్పట్లో రాజ్యాధికారం పురోహితవర్గం చెప్పుచేతల్లో వుంటే యిప్పట్లో "కోటరీ"ల కనుసన్నల్లో వుంటుంది. అటువంటి కుతంత్రాలను కొందరు రాజులు గ్రహించి వాటిని వ్యతిరేకించిన సందర్భాలు అరుదు. కోటరీల కుతంత్రాలకు ఎదురు నిలువలేని ప్రజా ప్రభుత్వాలను మనం కళ్లప్పగించి చూస్తూనేవున్నాం. అటువంటి కుటిలయత్నాల్ని భగ్నం చేయవలసిన అవసరాన్ని కవిరాజు త్రిపురనేని ఆనాడే గ్రహించిన తీరును వెల్లడించేందుకే యీ ప్రయత్నం.

కాలగమనంలో భాష పటుత్వం రచనల్లో సన్నగిల్ల సాగింది. అయితే దానిని భావం పూరించేందుకు పూనుకుంది. భాషను కొంచెం మార్చినా, భావవిప్లవ ప్రదాత కవిరాజు త్రిపురనేని రామస్వామిగారి భావాలను యథాతథంగా యిందులో ప్రతిబింబించే ప్రయత్నం జరిగింది. ఈ మధ్య రామస్వామిగారు నాస్తికుడు కాదనేవరకు తీగపాకం లాగుతున్నారు కొందరు. ఈ నాటకం కొంతమేరకు అటువంటివారికి కనువిప్పుకాగలదు.

రామస్వామిగారు తమ పేరు చివరన వున్న "చౌదరి" అనే పదాన్ని తొలిసారిగా తొలిగించుకుంది ఈ రచన సందర్భంగానే అనేది అందరికీ గుర్తు చేయాలనుకున్నాం. నాటక రచనను పద్యాలు లేకుండా తీర్చిదిద్దిందీ యిందులోనే. ఇన్ని విషయాలు కలగలిసి యీ పుస్తకాన్ని యీ రూపంలో మీ ముందుండేట్లు చేశాయి.

ఈ నాటకాన్ని మన మాటల్లోకి రూపాంతరం చేసిన కవిరాజు సాహిత్యాభిమాని శ్రీ రావెల సాంబశివరావుకు వారికి సహకరించిన గుంటూరులోని కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి సభ్యులకు కృతజ్ఞతలు

**- ప్రచురణకర్తలు**

# తొలిపలుకులు

**– త్రిపురనేని రామస్వామి**

ఒకనాడు పొద్దుటిపూట మా స్నేహితుడు మహారాజరాజశ్రీ నందూరి శేషాచార్యులు గారింటికి పొద్దుపుచ్చే కబుర్ల కోసం వెళ్లాను. మేజాబల్లపై విశ్వనాథ సత్యనారాయణగారి 'వేనరాజు' ప్రతి వుంటే తీసి చదవసాగాను. చదువుతూ పోతూంటే ఆందోళన చెందసాగాను. చదవటం పూర్తి కాలేదు. ఆచార్యులుగారి అనుమతితో ఆ పుస్తకాన్ని యింటికి తెచ్చుకొని చదవటం పూర్తి చేశాను. కలవరపాటు కలిగింది. నిజానికి వేనరాజు మనుష్యుల పుర్రెలతో చెరలాడేంతటి క్రూరుడా? అందువల్లనే చంపదగిన వాడయ్యాడా? ఇటువంటి సందేహాలు కలగటం వల్ల వెంటనే భాగవతంలోని వేనరాజు కథను చదివాను. నిట్టూర్పు విడిచాను. నా సందేహం పటాపంచలయ్యింది. వాస్తవానికి వేనరాజును "ఖూనీ" చేశారని నాకు అర్థం అయ్యింది. విశ్వనాథ వారి వేనరాజు నాటకం కారణంగా వేనరాజుకు గొప్ప అపచారం జరిగిందనే గట్టి నమ్మకం కలిగింది. ఈ అపచారాన్ని వెంటనే తొలగించి వేనరాజు నిజస్వరూపాన్ని లోకానికి చూపెట్టటం ధర్మమని భావించాను. దీని ఫలితమే "ఖూనీ" అనే ఈ చిన్న పుస్తకము ఇలా పుట్టింది. ఈ పుస్తకం నాతో వ్రాయించిన విశ్వనాథ సత్యనారాయణ గారి మేలు నేనెన్నటికి మరువలేను.

ఏనాడో మరిచిపోయిన తాతలనాటి పాత కథల్ని తవ్వి, పెళ్లగించి, విశ్వనాథవారు "ఆర్య ఋషుల" గొప్పతనాన్ని, వారి నడతను, స్వభావాన్ని కొత్తమాటలు పేర్చి లోకానికి తెలియజెప్పాలనుకున్నారు. అలా చేసేందుకు వారికి హక్కులేదని ఎవ్వరూ చెప్పజాలరు. "ఆర్యఋషులు" గంటంతో దాని పదును అరిగిపోయేవరకు, ఆకులు చిరిగి పోయేవరకు వాళ్లు వ్రాసింది ధర్మమా కాదా అని ఆలోచించకుండ వ్రాసే హక్కున్నప్పుడు విశ్వనాథ సత్యనారాయణ గారికి మాత్రం అటువంటి హక్కు లేకుండా ఎలా వుంటుంది?

అయితే యిటువంటి హక్కే వేనునికి ఎందుకు ఉండకూడదని మా వాదన. ఋషులకు ఎదురు నిలిచి వారి వాదనను ఖండించి ధర్మ ప్రచారానికి పూనుకున్న వేనుడు ఎలా హింసించేవాడయ్యాడో ఊహకు అందటం లేదు. వేనుడు హింసించే వాడయినప్పుడు మిగతా వాళ్లెందుకు కాకూడదు? పైన చెప్పిన కారణాల వల్ల వేనరాజును చంపటం నిందింపదగినది?, దూషింప దగినది ఎందుకు కాదు? వాళ్లు చేసిన తప్పుడు పనిని

సమర్థించి, అదే ధర్మమని బోధించేందుకు తమ సంతానంలో ఒకరు నడుం బిగించి యిప్పటికి బయలుదేరారన్న మాట విని "ఆర్య ఋషులు" ఎంతగా సంతోషిస్తారో కదా! "వేనరాజు" నాటకాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కృతికర్త తానొక ఆర్యఋషి సంతతికి చెందిన వాడిననే నమ్మకంతో వేనుని చంపటాన్ని సమర్థించేందుకు ఎన్ని పాట్లు పడవలసి వచ్చిందో తప్పక తెలియవస్తుంది. సత్యనారాయణగారు ఉపయోగించిన "ఆర్య ఋషి" అనే మాట వేరొక మాటను గుర్తుకు తెస్తున్నది. మనవాళ్లు చేసిన తప్పును కప్పిపుచ్చేందుకు మహనీయుల్ని ఆడిపోసుకోవటం దుండుడుకు తనం కాకుండ పోతుందా. సత్యనారాయణగారు బహుముఖ ప్రజ్ఞావంతుడు (Versatile genius) కావచ్చును; కాకపోవచ్చును. దానితో మాకు సంబంధంలేదు. ఆయన వ్రాసిన పుస్తకాలు, అందులోని అభిప్రాయాలతోనే మా సంబంధం.

వేనరాజు చరిత్ర భాగవతంలో చతుర్థ స్కంధంలో వుంది. ఈ వేనుడు పృథు చక్రవర్తికి తండ్రి. భాగవతం పృథుచక్రవర్తిని వేనుని తనూజుడు అంటున్నది. తనూజ శబ్దం యిక్కడ అతికినట్లు సరిపోతున్నది. వేనుని శరీరాన్ని మథించటం వల్ల పృథువు పుట్టాడని ఆర్య ఋషులు చెప్తున్నారు. వేనుని శరీర మథనం కూడా వేనుడు మరణించిన వెంటనే జరగలేదు. కొన్ని రోజులకో, వారాలలో, నెలలకో, సంవత్సరాలకో జరిగినట్లు భాగవతం వలన తెలియవస్తోంది. ఇంతకాలం చెడిపోకుండా ఎట్లా వుంటుందని పాఠకులు సందేహించవచ్చు. "శిపివిష్ట దేవతాకంబయిన పురోడాశంబు" (విష్ణువో, శివుడో ఎవరైతేనేం వాళ్లు పెద్దలకు యిచ్చే ప్రసాదం) చే నిర్వహింపబడిన హోమం నుండి బయటకు వచ్చిన "స్నిగ్ధ సాయంబు" (చిక్కగా వుండే తియ్యటి పదార్థం) వలన కలిగిన వాడైనందువల్ల ఇటువంటి పవిత్ర దేహం కలిగిందని అనుకోవాలి. ఏది ఏమయితేనేంలే వేనుడు పృథు చక్రవర్తికి తండ్రి అనే విషయాన్ని పురాతన గ్రంథాలు చెప్తున్నాయి. ఆర్య ఋషులు చెప్పిన ప్రకారం పృథువు షట్చక్రవర్తుల్లో ఒకడు. మా అభిప్రాయం ప్రకారమైతే సుగ్రీవుడు, విభీషణుడు, ప్రహ్లాదుడు మొదలైన వాళ్లవలె పృథువు కూడ కుటుంబద్రోహి.

వేనుని విషయంలో భాగవతం యిలా చెప్తూంది. అంగరాజు పూర్వ జన్మలోను, ఈ జన్మలోనూ కొడుకుల్ని కనలేదు. అందువలన అంగరాజు ఆహ్వానించినా ఆయన చేసే యజ్ఞానికి దేవతలు రాలేదు. వచ్చి పప్పు బెల్లాలు పుచ్చుకొని పోలేదు. అందువల్ల ఆర్య ఋషులు ఆయనతో పుత్రకామేష్టి యజ్ఞం చేయించారు. దాని ఫలితంగా వేనుడు పుట్టాడు. ఒక్కడే కొడుకు కావటంతో ఎక్కువ గారాబంగా పెంచటంతో ఆకతాయి అయ్యాడు. అందువల్ల అంగరాజు బాధతో చనిపోయాడు. ఆర్య ఋషులందరూ గుమిగూడి యజ్ఞ మహిమ వలన పుట్టిన వేనునికి రాజ్యం అప్పగించారు. అప్పుడు వేనుని నిజస్వరూపం బయట పడింది.

ఆర్య ఋషులపై తిరగబడ్డాడు. రాజ్యం అల్లకల్లోలమయ్యింది. ఆర్య ఋషులంతా పోగై అతణ్ణి చంపటం మంచిదని తీర్మానించి చంపేశారు. వేనుడు దుర్మార్గుడు అని చెప్పదలచిన భాగవతము చెప్పిన కథయిది. దీనిలోని నిజానిజాలు నిరూపించేందుకు భాగవతంలో ఏవయినా ఆధారాలు దొరుకుతాయా అని ఆలోచించవచ్చు. వేనుడు చిన్నతనంలో మగపిల్లల్ని పశువుల్ని చంపినట్లు చంపివేశాడట. ఇది గనుక నిజమయితే అంగరాజు చనిపోయిన తరువాత ఆర్య ఋషులు అందరూ ఒక చోట చేరి చర్చించి వేనునుకి పట్టం ఎలా కట్టారు? భవిష్యత్తును తెలుసుకొను ఋషులు ఈమాత్రం కూడ ఎందుకు తెలుసుకొనలేక పోయారు?

చండశాసనుడయిన వేనుడు పట్టాభిషిక్తుడు కాగానే పామును చూచి భయంతో ఎలుకలన్నీ పారిపోయినట్లు, దొంగలంతా అడవుల్లోకి ఎందుకు పారిపోయారు? వేనుడు ధర్మ ప్రభువు కానట్లయితే దొంగలకు భయమెందుకు? దీనిని బట్టి చూస్తే వేనుని రాజ్యంలో దొంగలు కాని వారికి భయంలేదని స్పష్టంగా తెలుస్తున్నది. మరి యిటువంటి ధర్మ ప్రభువును "ఆర్య ఋషులు" ఆకతాయిగ, క్రూరునిగ, కసాయిగ చూపి చంపవలసిన అవసరం ఏమొచ్చింది? దీనికి తగిన కారణం భాగవతంలోనే కన్పిస్తున్నది. వేనుడు రాజు అయిన వెంటనే నిజస్వరూపం బయటపడింది. తన రాజ్యం నాలుగు మూలలా యిలా చాటించాడు – బ్రాహ్మణుల పప్పులుడకవని. వేన రాజ్యంలో బ్రాహ్మణ సంతర్పణలు మాన్పించాడు. వెంటనే మంత్రతంత్రాలతో వేనరాజును ఖూనీ చేయించారు. ఇదీ ఆర్య ఋషుల పరార్ధజీవనం, పరోపకారశీలత.

## వేనుడు

భాగవతం ప్రకారం వేనుడు పాషండుడు, నాస్తికుడు.

పాషండుడంటే వేదాలకు దూరంగా వుండేవాడు. ఇందులోగల తప్పు అర్థం కావటంలేదు. ప్రస్తుతం ఈ ప్రపంచంలో నివశించే 150 కోట్ల మందిలో (ఇది 1935 నాటి మాట) వేదము పట్ల విశ్వాసం కలిగి, వాటిని అనుసరించి నడుచుకునేవారు పదికోట్లకు మించి వుండరు. పాషండుడు అనే మాట యితర మతాలవారిని తిట్టేందుకు ఉపయోగించే మాట. హిందువులు హిందువులు కాని వాళ్లను మ్లేచ్ఛులని, మహమ్మదీయులు వాళ్ల మతానికి చెందని వాళ్లను కాఫర్లని, క్రైస్తవులు యితరులను 'హిథెన్సు'లని దూషించటం మనం నిరంతరం వింటూనే వుంటాం. ఇంతెందుకు, శైవులు వైష్ణవుల్ని, వైష్ణవులు శైవుల్ని యింతకన్న

గొట్టుమాటల్లో  ఒకళ్ళనొకళ్ళు తిట్టుకోవటం మనకు తెలిసిన విషయమే. కనుక పాషండుడనగానే ధర్మపీడలు చేసేవాడనే అర్థం చెప్పుకోరాదు.

## నాస్తికుడు :

నాస్తికుడు అంటే దేవుడు లేదని నమ్మేవాడు. అయితే వేనుడు నాస్తికుడైనట్లు కన్పించదు. తాను ఈశ్వర ప్రతినిధినని కనుక తన అధికారాన్ని యితరులు ధిక్కరించే వీలులేదనే విషయంపై వేనునికి నమ్మకం వుందనే దానికి భాగవతంలోని ఈ పద్యాలే సాక్ష్యం.

*హరి హర హిరణ్య గర్భ*
*స్వరధీశ్వర వహ్నిశమన జలధిపతి మరు*
*న్నర వాహన శశి భూరవి*
*సుర ముఖ్యులు నృపశరీర సూచకులగుటన్*

(త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు, ఇంద్రుడు, అగ్ని, యముడు, సముద్రుడు, పవనుడు, కుబేరుడు, చంద్రుడు, భూమి, సూర్యుని వంటి, వేల్పులలోని ముఖ్యులు అందరు రాజు వంటి వారే కనుక)

*పరికించి నను భజింపుఁడు*
*ధరణీశుఁడు సర్వదేవతామయుఁడగు మ*
*త్సర ముడుగుఁడు నా కంటెను*
*బురుషుఁడు మరియెవ్వఁడగ్ర పూజార్హుఁడిలన్*

(బాగా ఆలోచించి నన్ను సేవించండి. రాజు దేవతలందరి సమిష్టి రూపము. కోపాన్ని విడనాడండి. అగ్రపూజలు అందుకునేందుకు నాకు మించిన మగవాడు మరెవ్వ డున్నాడు?)

దీనినే పశ్చిమదేశాల్లో రాజుల దివ్యత్వపు హక్కు అంటారు. నాలుగైదు శతాబ్దాల క్రిందటి వరకు యిటువంటి అభిప్రాయమే పశ్చిమదేశాల్లో విపరీతంగా వ్యాపించి వుంది. రాజులు తప్పులు చేయాజాలరు అనే నానుడి దీని పిలకే. కొంచెం యించుమించుగ యిటువంటి అభిప్రాయాన్నే "ఆర్య ఋషులు" కూడ అంగీకరించారు. అలా కాకుంటే "నా విష్ణుః పృథివీపతి" (విష్ణువు అంశలేనివాడు రాజు కాలేదు) అను లోకోక్తికి కారణమే వుండదు కదా. ఇటువంటి పరిస్థితుల్లో వేనుని ఖూనీ చేయటం యెంత న్యాయమో బుద్ధిమంతులు వూహించుకొనగలరు.

పరిశీలించి చూస్తే మాత్రం వేనుని అభిప్రాయాలన్నీ నాస్తికత్వానికే దారి

చూపుతున్నట్లుగా కన్పిస్తాయి. వేనుడు బౌద్ధమతమునకు మార్గదర్శి అని అభిప్రాయ పడుతున్నాం. నాస్తికులలో లోక విరోధులు కానివాళ్లు, లోకాన్ని మోసం చేయనివాళ్లు అనేక మంది వున్నారు. జీవులపట్ల కనికరము కలిగి లోక శ్రేయస్సు కోసం పాటు పడిన వాళ్లు, పడుతున్నవాళ్లు ఎందరున్నారనేది నేర్పరులకు తెలిసిన విషయమేకదా. రాత్రిపూట గొప్ప గొప్ప పాపాలు మూటగట్టుకొని తెల్లవారుతూనే ముక్కుమూసుకొని జపం చేసేవాళ్ల వల్ల లోకం ఉద్ధరింపబడుతుందా? భగవంతుణ్ణి ప్రార్థిస్తే పాపం పటాపంచలవుతుందనే విశ్వాసం తప్పులు చేసేందుకు సహాయపడదా? ఆస్తికత్వము ప్రపంచ పరిణామమునకు ఆటంకాలు కలుగజేసిందేగాని తోడ్పడలేదని గట్టిగ చెప్పవచ్చును.

ప్రస్తుతం ప్రపంచంలో వున్న 150 కోట్లమంది ప్రజల్లో (1935 నాటి అంచనాల ప్రకారం) నాస్తికులే ఎక్కువ అని తెలిస్తే భగవంతునికి ఎటువంటి నష్టం వాటిల్లిందో తెలియవస్తుంది. ఏబదికోట్ల బౌద్ధులు, మతంలేని వాళ్లొక పదికోట్లు, చెట్లు, చేమల్ని పూజించేవాళ్లొక ఇరవైకోట్ల మంది, మతాన్ని దూరంగా తరిమిన పదికోట్లమంది రష్యనులు-యిలా అంతా కలిసి మొత్తం 90కోట్ల మంది నాస్తికులీప్రపంచంలో జీవిస్తున్నారు. పైగా హిందూ, క్రైస్తవ, మహమ్మదీయ మతాలను అవలంభించే కుటుంబాలలో పుట్టి పేరుకు ఆ మతాలలోనే కొనసాగుతూ దేవునిపట్ల విశ్వాసం లేనివాళ్లు ఎన్నో వేలమంది వుంటారు. గత ఇరవై సంవత్సరాల నుండి నాస్తికుల సంఖ్య విపరీతంగా పెరగసాగింది. (ఇది 1935 నాటి మాట)

## మతము :

వేనరాజు కాలంనాటికి మతం అనేది ఒకటున్నట్లుగా కన్పించదు. "ఆర్య ఋషులు" చెప్పే ధర్మాలే సనాతన ధర్మం అనుకునేవాళ్లు. "ఆర్యఋషుల" అభిప్రాయాలకు వ్యతిరేకమైన అభిప్రాయాలు కలవాళ్లను పాషండులుగా, నాస్తికులుగా లెక్కించారు. ఆ కారణం చేత వాళ్లను తిట్టటం, చంపటం జరిగేది. రాజులు "ఆర్యఋషుల" చెప్పుచేతల్లో వుండేవాళ్లు. నిదానంగా ఏ మహానుభావుడో చెప్పిన నీతులన్నింటినీ కట్టగట్టి అతని పేరుతో ఒక మతాన్ని ఏర్పాటు చేసి వేరే మతాల వాళ్లను బలవంతంగా తమ మతంలోకి దింపటం అలవాటుగా మారింది. ఇందువల్ల మతయుద్ధాలు జరగటం మొదలయ్యింది. దేశాలలో ఎక్కడ చూచినా రక్తపాతమే. ఈ విధంగా మతములు జనాభాను తగ్గించి దేశానికి మేలు కల్గించినట్లయ్యింది. క్రైస్తవానికి మూలస్థానం జెరుసలేము పట్టణం. అది మహమ్మదీయులైన అరబ్బుల స్వాధీనంలో వుంది. మరి ఆ పట్టణాన్ని స్వాధీనం చేసుకొనేందుకు ప్రాణాలు పోగొట్టుకొన్న వీరాధివీరులెందరో లెక్కించగలమా? హిందువులు, మహమ్మదీయులు తమ తమ మతాల

కోసం యుద్ధాలు చేసి ఎన్ని లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకున్నారో కదా! సోమనాథ్ దేవాలయం ముట్టడిలో ఎంతమంది భయం అంటే తెలియని రాజపుత్ర వీరులు ప్రాణాలు అర్పించారో. మత సహనాన్ని కొద్దిగానో, గొప్పగానో పాటించే హిందూదేశంలో జైనులు, బౌద్ధులు మతావేశంలో వేల సంఖ్యలో మాడిమసైపోలేదా? మతంపేరుతో మారణహోమాలు పాశ్చాత్య దేశాల్లో కూడ జరిగాయి. 1572వ సంవత్సరంలో ఫ్రాన్స్ దేశంలో 10,000 మంది ప్రొటెస్టెంట్లవి, కనికరం అనేది చూపకుండ, గొంతులు కోయటం జరిగింది. స్పెయినులో క్రైస్తవమతంలో చేరటం యిష్టంలేదంటే 300 మందిని కాల్చివేశారు. దేవుడి పేరుతో యిటువంటి క్రూరమైన పనులు ఎన్నో జరిగాయి. భగవంతుడనేవాడు ఒకడుండివుంటే తన పేర జరిగే అత్యాచారాలనైనా మాన్పలేడా?

మతం ప్రతిదేశంలోను మంచితనం, సోదరభావం, సమానత్వాలను చిందరవందరచేసి, మానవుల్ని అల్లకల్లోలంచేసి, ప్రపంచంలో శాంతి లేకుండా చేయటమేగాక మహా పురుషుల్ని ఎందరినో తన పొట్టన పెట్టుకొంది. దానికి నిదర్శనంగా ఒక ఉదాహరణ. సూర్యుని చుట్టు భూమి తిరుగుచున్నదని చెప్పిన “కోపర్నికస్” అనే ఖగోళశాస్త్రజ్ఞుణ్ణి రోమను చక్రవర్తి పెట్టరాని బాధల్ని పెట్టి చంపించాడు. మానవుడు బాగా మూఢ దశలో వున్నప్పుడు కొండగాని, ఏరుగాని, పందిగాని, కుక్కగాని ఏది ఎక్కువ భయంకరంగా వుండి మనస్సుకు అలజడి కల్గిస్తుందో దానిపై భక్తి విశ్వాసాలుంచి ప్రార్థించటం వాళ్ల పద్ధతిగా కన్పిస్తున్నది. ఇటువంటి జనుల సంఖ్య ప్రపంచంలో ఎక్కువే అనేది సుస్పష్టం. అయితే ఈ సంఖ్య క్రమ క్రమంగా పెరగటానికి బదులుగా తరుగుతున్నది. ఎందువలన? సామాన్య ప్రజలు అజ్ఞానపు చీకట్లలో మగ్గుతున్నప్పుడు, ఉబుసుపోకకో మనస్సును ప్రశాంతంగా వుంచుకునేందుకో దేవుడనే పాకుడుకొయ్య ఒకటి కావలసి వచ్చింది. ప్రజలు తెలివితేటలతో తమలో తాము తర్కించుకొనే కొలది భక్తి విశ్వాసాలు అంతరించి భగవంతుడు ఉన్నాడా లేడా అనే వాదోపవాదాలు బయలుదేరటం సహజం.

మానవుడు మృగదశలో వున్నప్పుడు యే కొండగానో, యే యేరుగానో వెలసిన దేవుడు, మానవ విజ్ఞానం వికసించే క్రమంలో యేరు, కొండల రూపాన్ని వదలి మృగమై, మనుష్యుడై, అదృశ్య రూపుడై, నిరాకారుడై, నిరంజనుడై, నిర్వి కల్పుడయ్యాడు. ఇక తరువాత దశ యేమిటి? శూన్యత్వము; అనగా నాస్తికత్వము. ఇదే మూఢ మానవుడు ప్రతిపాదించిన భగవంతుడికి నేడు వాటిల్లే దశ. రష్యాలో ఇరవయ్యేళ్ల క్రితం (1935 నాటికి) బయలుదేరిన యీ ప్రళయ ఘోషకు భయపడి అక్కడి గుడులలో నుండి (చర్చి) భగవంతుడు కాలిచప్పుడు కాకుండ ఎటో వెళ్లిపోయాడు. ఈ యిరవై సంవత్సరాలలో (1935 నాటి మాట) అచ్చట బయలుదేరిన సాంఘిక మానసిక పరిణామం ప్రపంచానికి ఆశ్చర్యాన్ని కలుగజేస్తున్నది. ఈ వింత పరిణామాన్ని చూచి ప్రపంచంలోని రాజకీయవేత్తలంత తబ్బిబ్బయి

ప్రపంచమేమయిపోతుందోనని దిగులు పడుతున్నారు.

రష్యాలో పది, పదిహేను కోట్ల జనాభా (అప్పటికి) వుంది. ఐరోపా యుద్ధానికి ముందు ఈ దేశాన్ని "జారు" అనే బిరుదున్న ఒక చక్రవర్తి పరిపాలిస్తూ వుండేవాడు. ఈ "జారు"ను ఆ దేశ ప్రజలంతా చిన్నదేవుడు (Little god) అని పిలిచేవాళ్లు. జారు పాలనలో ఆ దేశంలో మతావేశం దండిగా వుండేది. రాజు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రజలందరు విసుగు, విరామం లేకుండా భగవంతుణ్ణి పూజించాల్సి వచ్చింది. దీనివల్ల ప్రతిఫలం ఏమి లభిస్తుంది? ప్రజల్లో నూటికి డెబ్బై మందికి కూడు, గుడ్డ, మంచం, కంచం కరువయ్యాయి. ఐరోపా మహా సంగ్రామ సమయంలో జారు చక్రవర్తి హత్య దారుణంగా జరిగింది. దానికి భయపడి భగవంతుడు రష్యాను వదలి పారిపోయాడు. చిన్నదేవుడు చనిపోవటంతో పెద్దదేవుడికి గతిలేకుండా పోయింది. దేవాలయాలన్నీ యంత్రాగారాలుగా, పుస్తక భాండాగారాలుగా మారిపోయాయి. గుడులకు గల మడి మాన్యాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. తలదాచుకొనేందుకు యిల్లు వాకిలి లేని భగవంతుడు మాత్రం ఏమి చేయగలడు? ఈ మార్పువల్ల రష్యాకు కలిగిన లాభం ఏంటి? నూటికి డెబ్బయి మందికి తినేందుకు తిండి, కట్టుకునేందుకు బట్ట, పండుకునేందుకు మంచం, భోజనం చేసేందుకు కంచం దొరికాయి. మానవుడు తిరుగులేని అధికారాన్ని సాధించుకొన్నాడు.

ప్రార్థించినంత మాత్రాన, సేవించినంత మాత్రాన, కైంకర్యాలు చేసినంత మాత్రాన భగవంతుడు సంతోషపడి, సిరి సంపదలిచ్చి, పరలోక సౌఖ్యానికి ఏర్పాట్లు చేస్తాడనేది నమ్మదగిన మాటేనా? ఇవి ఎప్పుడుకూడా, ఎక్కడ కూడ జరిగిన దాఖలాలు లేవు. ఇది మానవ హృదయానికి చెందిన బలహీనతకు గుర్తుగా నిలుస్తుంది. ఈ ప్రార్థనలు, సేవలు, కైంకర్యాలు అన్నీ కూడ స్వాతంత్ర్యాన్ని పోగొట్టి, మానవ ప్రయత్నాన్ని మంటగలిపి, మానవ జాతిని పూజచేసే బానిసలుగా మార్చేందుకు తప్ప మరెందుకూ పనికిరావు.

పాషండులైనంత మాత్రాన (వైదికధర్మాల్ని పాటించనంత మాత్రాన) మానవులు పాపాలు చేసేవాళ్లుగా, ధర్మపీడల్ని కల్గించే వాళ్లుగా తయారవుతారని చెప్పటం లోకంపట్ల మహాపచారం చేసినట్లే. భగవంతుని ప్రేమించటం కంటే సాటి మానవుణ్ణి ప్రేమించటం అన్నిటి కన్నా మంచి పని. పాషండుడు అంటే అన్ని రకాలైన పాపాలు చేసేవాడని పామరలోకంలోని వూహల్ని ఆధారం చేసుకొని విశ్వనాథ సత్యనారాయణ గారు వేనరాజును ఆ విధంగా తీర్చిదిద్దటం జరిగింది. ఇది పొరపాటుపడి చేసినపని. పాషండులలో ఎంతగానో పవిత్ర జీవనం సాగించిన ఉత్తములు కలరనే విషయం ప్రపంచ చరిత్ర చదివిన వారికి తెలియకపోదు. కనుక పాషండులు అన్నంత మాత్రాన మానవులు దుర్మార్గులు కారని, వేనరాజును పాషండన్నప్పటికి సత్యనారాయణగారు చిత్రించినట్లుగా దుర్మార్గుడు కాడని రుజువు చేసేందుకే "ఖూనీ" రాయటం జరిగింది.

– త్రిపురనేని రామస్వామి

*సూతాశ్రమం, 1-9-1935*

# ఖూనీ

## మొదటి రంగం

(మునిపల్లె –యజ్ఞశాల – గౌతముడు, శునశ్శేఫుడు, బాలకులు – నవరంధ్రాలు బిగించి పట్టుకొనబడిన మేక – యజ్ఞగుండము – కట్టెలు – ప్రజ్వరిల్లే అగ్నిహోత్రం)

వేనుడు : (హడావిడిగా వచ్చి, చూచి, బిగ్గరగా) యజ్ఞాలకు అలవాటు పడిన ఆశ్రమవాసులారా! ఏమి పనయ్యా యిది? జంతుబలి వేనరాజ్యంలో నిషేధింపబడిన సంగతి మీకు తెలియదా? శిక్ష అనుభవించాలని వుందా?

గౌతముడు : శాంతించండి మహారాజా!

వేనుడు : ఆ మేకను వదిలెయ్యండి. యజ్ఞగుండలో ఒక్క కట్టెపడిందో ఓ ప్రాణం ఎగిరిపోతుంది. నా శాసనాన్ని ధిక్కరించి ఎవ్వడూ బ్రతకలేడు. నేను దేశ సంచారం చేసి స్వయంగా వాస్తవాలు గ్రహిస్తాను. కనుక ఎవ్వరికయినా తప్పించుకు తిరగటం కుదరని పని.

గౌతముడు : ఆర్య ఋషుల ఎదుట అంతటి అహంకార ప్రదర్శనా! మా శాపం వల్ల మండి మసికానివాడు లేడు.

వేనుడు : నేను ఎల్లకాలం జీవించనుగా! పోనీలే గౌతమా! మీ మునులలో పుట్టి చనిపోని వాళ్లుంటే ఒక్కళ్లని చూపెట్టు. శాపాలతో మనుషుల్ని చంపటం గొప్పని చెప్తున్నావా? పులి సాధు జంతువుల్ని చంపటానికి మీరు మనుషుల్ని శాపాలతో చంపటానికీ మధ్య తేడా యేముంది? ఒకవేళ మీరు నన్ను ఖూనీ చేయాలనుకున్నా నేను స్థాపించ దలచిన ధర్మము ప్రచారం పొందక ముందు మాత్రం అది జరగని పని.

గౌతముడు : అంత అహంకారమా? చావు బ్రతుకులు కూడ నీ చెప్పుచేతల్లోనే వున్నాయా?

వేనుడు : ఎత్తి పొడుపులు అంత వత్తి పలకవలసిన పనిలేదుగాని అసలీ లోకంలో అహంకారం లేని అభాగ్యుడెవ్వడున్నాడయ్యా? ధృష్టవర్మా! వీళ్ల మాటలతో మనకు పనిలేదు. వాళ్లను నెట్టివేసి ఆ మేకని ముందు కాపాడు. వాదన సంగతి తరవాతలే.

ధృష్టవర్మ : చిత్తం ప్రభూ. (మేక వైపుకు నడుస్తాడు)

గౌతముడు : ధృష్టవర్మా ! ఆగిపో. మంత్రించిన మేకను నువ్వు ముట్టుకోగూడదు

ధృష్టవర్మ : ఓహో! నేను మేకను ముట్టుకునే వరకు దానిని వదలి వేయరా?! ప్రభువు చెప్పిన ప్రకారం చేసుకుపోవటమే నాపని.

గౌతముడు : యజ్ఞశాలకు ఏం దుర్గతి పట్టింది! ఆర్యఋషుల్ని యిలా అవమానిస్తే వాళ్లు పడుండే రకం కాదు. వాళ్ల మాటలే ఈటెలు. కనుక మునులను ఎదిరించి సుఖనిద్ర పోయేవాడు ఎవ్వడూ వుండడని తెలియదా?

వేనుడు : గౌతమా! ఎందుకయ్యా అంత పరుషంగా మాట్లాడతావ్? నన్ను మీరు పాషండుడని నోటికొచ్చినట్లు పేల్తారా? మీ పొగడ్తలను, తిట్లను నేనసలు లెక్క చెయ్యను. వాటివల్ల నేను చలించను, నేను షండుడనైతేనేం, పాషండుడనైతేనేం; నా రాజ్యంలోని ప్రజలు సుఖ శాంతులలో వర్ధిల్లాలి. అంతేకాదు సమస్త జంతుజాలానికి కూడ బాధ కలగకూడదు. అలా బాధకలిగితే నా మనస్సు తరుక్కు పోతుంది. ఇన్ని మాటలెందుకు గాని యజ్ఞాలు ఏ విధంగా లోకానికి మేలు చేస్తాయో నిరూపించగలవా?

గౌతముడు : వేనరాజా! మొండి పట్టుదల మానుకో. దీనివల్ల మనలో ఎవరికీ ప్రయోజనం లేదు.

వేనుడు : ముందు నేనడిగినదానికి సమాధానం కావాలి.

గౌతముడు : అయితే విను. మీ అంగవంశంలో పుట్టినవాళ్లు నీతి, న్యాయం పాటిస్తారు. వేదాలు చెప్పే కర్మల్ని తోసిపుచ్చరు. అధికారమదంతో ప్రజల్ని పీల్చి పిప్పి చేసిందిలేదు. రాజధర్మాలను వీడిన వాళ్లు కాదు. సుభిక్షంగా తమ రాజ్యాలను పరిపాలిస్తూ బ్రాహ్మణుల ఆశీస్సులు పొందుతూ పేరుగడించి మీ పూర్వులు స్వర్గానికి పోయారు. మరి అటువంటి పూర్వుల మార్గాన్ని కాదని నడుచుకోవటం ధర్మమేనా?

వేనుడు : గౌతమా ఒక వేళ అదంతా నిజమే అయినా యిప్పుడు ప్రయోజనం లేదు. దేశకాలాలను బట్టి ఆచారాలు మారిపోతాయికదా. వారు విశ్వసించిన ధర్మములువేరు. నేను విశ్వసిస్తున్న ధర్మాలు వేరు. భూతదయకు అనుకూలం కాని పనులుచూస్తే నా గుండె కరిగి నీరవుతుంది

గౌతముడు : రాజా! మా ఇంటికి అతిథిగా వచ్చావు. మా ఆతిథ్యాన్ని స్వీకరించు.

వేనుడు : ఓహో అతిథి మర్యాదలు యిప్పటికి గుర్తుకు వచ్చాయి కాబోలు! నా ఆజ్ఞలపట్ల గౌరవం చూపకుండా నన్ను గౌరవించేదేముంటుంది?

గౌతముడు : ఏదో మారుమూల కుటీరాల్లో కాపురాలు చేసుకునే మాకు అతిథి, అభ్యాగతుల మర్యాదలు ఏం తెలుస్తాయిలే! పోనీలే యజ్ఞములు ఏ విధంగా లోకానికి మంచి చేస్తాయో చెప్తాను విను.

వేనుడు : వినేందుకు నేను సిద్ధంగానే వున్నా.

గౌతముడు : మేఘములు పొగవలన పుడతాయని తెలుసుగా ?

వేనుడు : అయితే ఎటువంటి పొగవలన?

గౌతముడు : యజ్ఞము చేసేప్పుడు లేచే పొగవలన.

వేనుడు : మిగతా రకాల పొగల సంగతేంటి?

గౌతముడు : యజ్ఞ ధూమానికుండే మహాశక్తి వాటికుండదు.

వేనుడు : అలా అని ఎవరు కనిపెట్టారో?

గౌతముడు : ఆర్య ఋషులు. జరిగినది, జరుగుచున్నది, జరుగబోయేది తెలిసిన మునులు వెఱ్ఱివాళ్లనుకుంటున్నావా?

వేనుడు : మునులు వెఱ్ఱివాళ్లని నేననుకోను. వాళ్లు కాల చక్రాన్ని సైతం ఎదురు తిప్పగలిగిన వాళ్లు. మునులే మాలాంటి వాళ్లను వెఱ్ఱివాళ్లనుకుంటారు. సరే ఈ ఘర్షణ ఎందుకులే. మీరు చెప్పేది పూర్తిగా చెప్పండి.

గౌతముడు : మేఘాలు యజ్ఞధూమాల నుండి పుడతాయి గనుక మీ ఆజ్ఞను ధిక్కరించి కూడ యజ్ఞాలు చేస్తున్నాం.

వేనుడు : అందుకు కారణం?

గౌతముడు : కారణమా?! కరువు రాకుండా వుండాలంటే పాడిపంటలు పుష్కలంగా వుండాలి. పాడిపంటలు పుష్కలంగా వుండాలంటే వానలు కురవాలి. వానలు కురవాలంటే మేఘాలు కావాలి. మేఘాలు కావాలనే మేము యజ్ఞాలు చేసి పొగ రాజేయటం.

వేనుడు : సరిపోయింది! – యజ్ఞాలు చేయాలంటే ఋషులు కావాలి. వాళ్లు కావాలంటే కుటీరాలుండాలి. వాటికోసం ఆశ్రమాలుండాలి! అంతేనా?! అసలు మీ కుతర్కము నా ముందు ఎలా నిలస్తుంది. నేను సునీథాదేవి కుమారుణ్ణని నీకు తెలియదా?! ఆమె గొప్ప విద్యాంసురాలు. మంచి వివేకంతో మసలు కుంటూ వుంటుంది. సృష్టి రహస్య జ్ఞానం తెలిసిన వనిత. ఆమె బోధనలో పెరిగిన నేను కుతర్కమును ఎలా అంగీకరించగలను? నా రాజ్యంలో యజ్ఞాలను నిషేధించి ఎంతకాలం అయ్యిందో గుర్తులేదా? మరి అప్పటి నుండి యిప్పటి వరకు మేఘాలు కన్పిస్తూనే వున్నాయే. వర్షాలు కురుస్తూనే వున్నాయే. ముక్కారు పంటలు పండుతూనే వున్నాయే. నా రాజ్యంలో కరువుల వూసేలేదే!

శునశ్శేఫుడు : వేనరాజా! నీవు చెప్పింది వాస్తవమే. అయితే యిదంతా నీ ధర్మ సంస్థాపన ఫలం అనుకుంటున్నావా? ఎంత వెర్రి వాడవయ్యా! మీ వంశంపై ప్రేమతో ఎందరో మునులు నీ రాజ్యంలోని కీకారణ్యాలలో యెన్నెన్ని యజ్ఞాలు చేస్తున్నారో నీకేం తెలుసు? అలా కాకుంటే ఈ రాజ్యం యింత సుభిక్షంగా వుండేదని భావిస్తున్నావా?

వేనుడు : శునశ్శేఫా ! కొత్త వింతలు తెలియజేస్తున్నావే! శాసన ధిక్కారం యెంత చులకనై పోయింది. రాజ్యమంతటా తిరుగుతూ ఈ దొంగచాటు యజ్ఞాలను నిలిపివేయాలి. నేను అంగరాజ్యానికి రాజునయిన రోజు నుండి కరువులు లేవు. దుర్భిక్షంలేదు. దొంగలు, వ్యభిచారులు పర సీమలకు పారిపోయారు. పౌరులు సురక్షితంగా వాళ్ల పనులు వాళ్లు చేసుకుంటున్నారు. తిండి లభించక మలమల మాడే వాళ్లు లేరు. పల్లెలలో సైతం ప్రజలు నిర్భయంగా నిద్రపోతున్నారు.

ధృష్టవర్మా! వాళ్ల వితండవాదాలు వింటూ అలా నిలబడిపోయావేం? ఆ రావిపేళ్లు ఊరికే కాలిపోతున్నాయి. వాటిని ఆర్పివేయవయ్యా. అసలు భగవంతుడొకడు వుంటే నోరులేని ఈ మేక మాంసం కోసం లొట్టలు వేస్తాడా?!

శునశ్శేఫుడు : ఆహో! వేనరాజా! ఏమి తెలివయ్యా నీది! నీ తండ్రి, తాత, ముత్తాతలకు తెలియని ధర్మ సూత్రాలు నీకు తెలుసన్నమాట. ఈ జీవాల్ని చంపేది దేవుళ్లను సంతోష పరిచేందుకు కాదు.

వేనుడు : కొత్తదారికి మళ్లావే! అయితే మరి యిలా జంతువుల్ని చంపటం దేనికో?

శునశ్శేఫుడు : మునులు స్వార్థపరులు కారని, ఇతరుల ప్రయోజనంకోసం జీవిస్తారని నీకు తెలియదా?

వేనుడు : అలా చెప్పుకోవటం తెలుసు...అయితే?

శునశ్శేఫుడు : ఈ యజ్ఞంవల్ల ఈ యజ్ఞ పశువు స్వర్గాన్ని చేరుకొంటుంది.

వేనుడు : మరి యజ్ఞం చేసినవాడు?

శునశ్శేఫుడు : అతడికీ స్వర్గం లభిస్తుంది.

వేనుడు : ఒహో! పరార్థ జీవనం అంటే యిదా? ఋషులు ఇతరుల బాగుకోసం జీవించే వాళ్లయితే యింకొక్క పని చేయకూడదూ?

శునశ్శేఫుడు : ఏమిటది?

వేనుడు : మీ కులపతి, గురువు అయిన వయసుమళ్లిన యీ గౌతముడు నిన్ను యజ్ఞ పశువును చేసి క్రతువును ముగిస్తే లోకం ఎంతగా సంతోషిస్తుందో! ఒక్క యజ్ఞంతోనే గురు శిష్యులిద్దరికి స్వర్గలోక సుఖాలు దక్కుతాయి గదా! మీ జాతికి చెందని ఈ మేకకు సద్గతులు కల్పించటం కన్న చిన్నప్పటి నుండి సేవించే నీకు ఉత్తమలోకం దక్కేట్లు చేయటం సమంజసంగా వుంటుంది కదా! గౌతమా! అలా ఎందుకు చేయకూడదు? అందులో తప్పులేదు కదా!

ధృష్టవర్మ : ప్రభూ ! ఈ శునశ్శేపుణ్ణి ఈ గుంజకు కట్టివేయమంటారా?!శునశ్శేఫా! ఇంత చౌకగా స్వర్గం లభిస్తూంటే యింక ఆలస్యందేనికయ్యా?!

వేనుడు : అతడు యజ్ఞపశువు అయ్యేందుకు యిష్టపడాలికదా! అంతవరకు కొంచెం ఆగు. శునశ్శేఫా! ఉత్తమ లోకాలంటే ఏమిటో ఇంతవరకు చెప్పనే లేదు. సోమరులుగా తిని స్వేచ్ఛగా తిరగటం, కల్లుత్రాగటం, వయసుమళ్లిన వేశ్యలతో ముద్దుముచ్చట్లేనా?

గౌతముడు : అటువంటి విషయాలలో విశ్వాసమే లేని నీకు వాటి వూసెందుకు?

వేనుడు : తెలుసుకున్న తరువాత అయినా విశ్వాసం కుదురుతుందేమో! దయచేసి కొంచెం తెలియజెప్పండి.

శునశ్శేపుడు : ఇవి కొన్ని మాత్రమే!

వేనుడు : మిగిలినవి?!

శునశ్శేపుడు : ఎందుకులే ఈ ఎగతాళి పంచాంగము

వేనుడు : ఇందులో ఎగతాళి ఏమున్నది? ఆలోకంలో దొరికేవి యివే అయితే అవన్నీ యీ భూలోకంలో దొరకవా? విచ్చలవిడిగా తిరగవచ్చుగా! పీకలవరకు తాగవచ్చుగా! ముసలి పడుపుకత్తెల కౌగిళ్లలో కులక వచ్చుగా! దిక్కులేని ఒక జంతువును చంపి ఉత్తమ లోకాన్ని చేరాలనుకోవటం కన్న మించిన స్వార్థం మరేముంటుంది? అసలు పరలోకాలు వున్నవో లేవో? ఉన్నా అవి ఉత్తమలోకాలు అవునో కాదో? ఒకవేళ అయినా ఈ మేకను నిప్పుల్లో పేల్చి దాని మాంసం తిన్నంతమాత్రాన అవి దొరుకుతాయోలేదో! ఇలా ఉన్నవో లేదో తెలియని పరలోక సుఖాలకోసం భూతదయను చూపకుండ దానిని హింసించి ఎందుకు మూర్ఖుడివి కావడం?

శునశ్శేపుడు : వేనరాజా! ఇది పొగడటమా? బెదిరించటమా? గేలిచేయటమా? సహించలేకున్నాను.

వేనుడు : నా మాటలే నీకు భరించరానివిగా వుంటే మరి ఆ మేక నవరంధ్రాలు మూసివేసి, నిప్పుల్లోవేసి పేల్చుతారని వినగానే నేనుపడే మనోవేదన ఎవరికి తెలుస్తుంది? శునశ్శేఫా! ప్రాణులన్నింటి పట్ల సమభావాన్ని చూపు. వయసు మళ్ళిన గౌతముని మాటలు విని మతిపోగొట్టు కోవద్దు.

గౌతముడు : ఈ నిష్ఠురపు మాటలు చెవులలో శూలంగుచ్చుతున్నట్లుగా, మనస్సులో బాణం నాటుతున్నట్లుగా వున్నాయి.

వేనుడు : ఈ బుడి బుడి కన్నీళ్లెందుకులే పెద్దాయనా! బ్రాహ్మణుడు కానివాడు వేదాన్ని విన్నాడని అతడి చెవుల్లో కరిగించిన సీసం పోసినప్పుడు నీ మనస్సు ఎలా వుందో?

శునశ్శేఫుడు : వేనరాజా! మీకు ఎంత అధికారమున్నా అది ఎంతగా తిరుగులేనిదైనా యింతగా బరితెగించి ప్రవర్తించటం ధర్మమనిపించుకుంటుందా? ప్రజలను కాపాడుతూ, వాళ్లకు తెలియజెప్తూ మంచిమార్గాన నడిపించవలసిన మహారాజువు. పూజ్యులైన ఆర్య ఋషులు తలపెట్టే యజ్ఞాలను మాన్పించి నీవు నరకానికి పోవటం యెందుకు?

వేనుడు : శునశ్శేఫా! మునులు ఏంచేసినా సరే వాటిని అంగీకరించకపోతే నరకానికి పోవలసిందేనా? ఎందుకనీ?!

శునశ్శేఫుడు : వాళ్లు ఇతరుల బాగుకోసం బతుకుతారు గనుక.

వేనుడు : వాళ్లు ఉత్తమలోకాలకు పోయేందుకు యే జంతువునో నిప్పుల్లో పేల్చితినటం ఇతరుల బాగుకోరి చేసే పనేనా?

శునశ్శేఫుడు : మునుల్ని యెదిరిస్తే నరకలోకానికి పోవటం జరిగి తీరుతుంది.

వేనుడు : నరకలోకమా? అదెక్కడుందో? ఎంత దూరంలో వుందో? నువ్వుగానీ, నీ గురుపరంపరలోని వాళ్లుగాని ఎవరయినా ఎప్పుడయినా చూసివచ్చారా? అదంటేయేమిటో బాగా తెలిసినట్లు మాట్లాడు తున్నావే!

గౌతముడు : రాజా! అటువంటి హేళనకు నీ నాలుక చీలిక కాదేమయ్యా?! ఎటువంటి గొప్పగొప్ప వాళ్లను నువ్వు నిందిస్తున్నావు?

వేనుడు : మీరేమయినా కోరుకోండిగాని నా నాలుక చీలిపోవాలని మాత్రం కోరుకోవద్దు. నా నాలుక చీలితే మరింత భయంకరమైన పాముగా కన్పిస్తాను. దయతో మీరు నన్నిలాగే వుండనివ్వండి. మీ తపోశక్తి గూడ ఖర్చుగాకుండా వుంటుంది.

శునశ్శేపుడు : ఈ యెత్తి పొడుపుల కారణంగా మనస్సు వికలమైపోతున్నది. వేనరాజా ఎవ్వరు యెంతగా అడ్డుపడినా నీకుమాత్రం నరకం తప్పదు.

వేనుడు : ఎవరయినా అడ్డుపడటం దేనికిలే–పోవలసిన అవసరం పడితే పోతాను. అయితే అక్కడమాత్రం మీ వంటి మునులుగాని, యిటువంటి కటిక దుకాణాలుగాని, యిటువంటి ధర్మపీడలుగాని వుండవు కదా?

శునశ్శేపుడు : మా వంటి మునులు అక్కడెందుకుంటారు?

వేనుడు : మీ వంటి మునులు అక్కడలేనప్పుడు నేను అక్కడ వుండేందుకు అడ్డంకి ఏముంటుంది? నాకు అంతకన్న కావలసినదేమున్నది? అధర్మంగా నడిచే మీ వంటి వాళ్ల పొత్తులేకుండా మీరులేని నరకంలో మనోవేదనకు దూరంగా వంటరిగా బతకటం మేలుకాదా? ఇన్ని జంతువుల్ని యజ్ఞాల పేరుతో నిప్పుల గుండంలో పడకుండా చూచి వాటికి ప్రాణదానం చేసినందుకు నేను నరకానికి పోయినా మేలే. అయినా ప్రాణాలు కాపాడినందుకు లభించేది నరకలోకమా? నాకు నరకలోకానికి పోయేందుకు చెల్లు చీటీ యిచ్చే వాళ్లెవళ్ళో?!

శునశ్శేపుడు : భగవంతుడు.

వేనుడు : ఆ మహానుభావుడెవరండీ? ఎలా వుంటాడు? నా రాజ్యంలో ఎన్నడూ నేను చూచినట్లు లేదే? అయినా ఆయన యేం ఉద్యోగం చేస్తాడో చెప్పనేలేదేం?

శునశ్శేపుడు : ఈయన ఈ ప్రపంచమంతటావుంటాడు. సృష్టి స్థితి లయలకు ఈయనే కారకుడు. దుష్టుల్ని శిక్షించటం, శిష్టుల్ని రక్షించటం యీయన చేసే వుద్యోగము. రేయింబవలు ఈ ప్రపంచాన్ని కనిపెట్టుకొని వుంటాడు.

వేనుడు : అయ్యో ! నిద్రాహారాలు మాని పాపం రాత్రి, పగలు పాటుపడుతూ బాధపడే ఈ మహామహుడా నాకు నరకలోకం దానం చేసేది! జీవహింసకు పాల్పడుతున్నందుకు మీకు స్వర్గము, దానిని అరికట్టే నాకు నరకమూనా! కొత్తగా మీరు సృష్టించిన దేవుడు తన ధర్మాన్ని కూడ మరిచిపోయే వాడుగా వున్నాడే! ఈ లోకంలో ఎంత మంది దుష్టులు శిక్షను తప్పించుకుంటున్నారో! ఎంతమంది మంచివాళ్లు శిక్షింపబడుతున్నారో.

గౌతముడు : అయ్యో! చివరకు దేవుణ్ణి కూడ పరిహాసం పాలుగావిస్తున్నావా? నీకు అసలు ప్రాయశ్చిత్తమే లేనట్లున్నది.

వేనుడు : నాకు ప్రాయశ్చిత్తమే లేనట్లున్నదా? మీకు చిత్తమే లేనట్లు కన్పిస్తున్నది.

గౌతముడు : ఏమేమి?

వేనుడు : ఒకరికి ప్రాయశ్చిత్తము యింకొకరికి చిత్తములేనట్లున్నది. కంటికి కనిపించని వాడు, మానవులచే తయారు చేయబడిన దేవుడు సృష్టి స్థితి లయకారకుడా? అవి స్వభావం వలన ఏర్పడేవికదా. వాటిపై భగవంతునికి ఏం పెత్తనం వుంటుంది?

గౌతముడు : పాపము శాంతించునుగాక! ఏమి పాపము చేసికొన్నందువల్ల యిటువంటి మాటలు వినవలసివస్తున్నదో!

వేనుడు : ఇంతకు ముందు నీవు చేసిన పాపములు మాకు తెలియవు. ఇవ్వాళ మాత్రం యజ్ఞం అనే వంకతో మహా పాపాన్ని మూటగట్టుకొనే వాడివే– నేను అడ్డుకోకుండా వుంటే. సరే దాన్నలా వుంచుదాం.
ప్రపంచంలో రోజూ జరిగే అన్ని పనులపై దేవునికి పెత్తనం వుంటే యిన్ని ఘోరాలు, నేరాలు జరగకుండా ఎందుకు నిలిపివేయడు?

శునశ్శేఫుడు : నీ మాటకు ఎదురు చెప్పేవాడెవడున్నాడులే అనే కదా యిలా విచిత్రంగా వాదించటం. కర్మననుసరించి చేసేపనులను ఎవ్వరూమాన్పలేరు

వేనుడు : అయితే భగవంతుని వలన ప్రయోజనంలేనట్లేగా?

శునశ్శేఫుడు : వేనరాజా! మహాపాపాన్ని మూటగట్టుకొంటున్నావు.

గౌతముడు : భగవంతుడు నిష్ప్రయోజకుడుకాడు; కర్మలన్నింటికి సాక్షి.

వేనుడు : కూట సాక్షియా? కళ్ళెదుట జరిగే క్రూరకర్మల్ని మాన్పించటం ఎలాగో తెలియక సాక్షిగా నిలుస్తున్నాడా? ఈ సాక్ష్యం వలన ఎవరికి ప్రయోజనం కలుగుతుంది? అసలు విచారించేవాడెవడు?

గౌతముడు : వేనరాజా! నువ్వు పాషండుడివి. నీకు ముక్తిలేదు.

వేనుడు : లేకపోతే పోనీలే. ఆ బెదిరింపులెందుకు? అవి నావంటివాణ్ణి ఏమీ చేయలేవు. లోకాన్ని మాయజేసి మీ పాడు పనులకు తోడ్పాటు అందించే దేవుణ్ణి సృష్టించి, లేనిపోని శక్తులన్ని అతనికి అంటగట్టి ప్రపంచాన్ని ఉగ్రూతలూగించే ప్రయత్నం చేస్తున్నారు. మీకేమో ముక్తి, నాకేమో అదిలేదా?!

గౌతముడు : గొప్ప పాపానికి దారితీసే నీ కారుకూతల్ని వినలేనురాజా!

వేనుడు : పాపాలు చేయగల్గుదువు గాని, నా మాటలు వినలేవా? నిజం చెప్పు ఈ భగవంతుణ్ణి మీరు కాదా కల్పించింది? మీ అవసరాలను బట్టి భగవంతుణ్ణి రకరకాల అవతారాలెత్తించలేదా? అవసరాన్ని బట్టి అతడి భాషను, వేషాన్ని మార్చలేదా? ఒకప్పుడు అతణ్ణి నిరాకారుడన్నారు; తరువాత సాకారుడన్నారు; తిరిగి భీకరా కారుడన్నారు; చివరకు వికారుణ్ణి కూడ చేసేశారు. అతడికి నైవేద్యంగా ఒకప్పుడు నరమాంసం, తరువాత గోమాంసం, మృగమాంసం; మరొకప్పుడు పూలు పండ్లు అందించారు. మీ బుద్ధి ఎటు తిరిగితే అటు భగవంతుణ్ణి మార్చుకుంటూ పోయారు. సత్యాన్ని నువ్వు దాచాలన్నా దాచలేవు.

గౌతముడు : వేనరాజా! నువ్వు నాస్తికుడివి. నీతో మాట్లాడితేనే పాపం చుట్టు కుంటుంది. ఈ ఆశ్రమం నుండి వెళ్లిపో. తిరిగి మళ్లీ ఈ గడపలోకి రాకు.

వేనుడు : నేను నాస్తికుణ్ణయితే ప్రపంచానికొచ్చే నష్టమేముంది? నేను నా నాస్తికత్వంతో ప్రపంచానికేమయినా ద్రోహం చేస్తున్నానా? ఇతరులను హింసించి లోకాన్ని ఏడ్పులు, పెడబొబ్బల్లో ముంచుతున్నానా? నాస్తికత్వం పాపహేతువన్నావు కదూ? అసలు పాపమంటే ఏమిటి?

గౌతముడు : సరిసరి! నీకు పాపం అంటే ఏమిటో తెలియనందువల్లనే అలా నిరంకుశంగా ప్రవర్తిస్తున్నావు. ఇక నీ చేతుల్లో బడి ప్రజా సౌభాగ్యం పెరిగేదెలా?

వేనుడు : గౌతమా! నేనడిగిందేమిటి? నువ్వు చెప్పేదేమిటి? మీ శిష్యులందరికి కూడా యిలాగే బోధిస్తున్నావా?!

అది సరే ధృష్టవర్మా! అగ్ని గుండాన్ని ఆర్పివేశావా?

ధృష్టవర్మ : చిత్తం మహారాజా! శునశ్శేపుణ్ణి యేం చేద్దాం? మేకను వదిలిన గుంజకు కట్టివేయమంటరా!

వేనుడు : నీ ప్రశ్నకు సమాధానం చెప్పవలసింది కులపతి. అయినా వితండవాదం చేసే వాళ్లతో మాట్లాడి ప్రయోజనం లేదు. నిద్రపోయినట్లు నటించే వాణ్ణి మేల్కొల్పటం ఎవరివల్లవుతుంది? పద పోదాం.

(ఇంతలో ఒక పొడల జింకపిల్ల వేనుని కాళ్లవద్ద తిరుగుతూ వుంటుంది)

శునశ్శేఫా! ఎక్కడిదీ జింకపిల్ల?! దీనికింక మానవుడి స్వభావము తెలిసినట్లులేదు. అతడిని నమ్మి మచ్చికగా వుంటున్నది.

శునశ్శేపుడు : ఇది ఆశ్రమంలో పెరిగి పెద్దదవుతున్నది.

వేనుడు : ఎందుకు పెంచుతున్నారు? మరచేపోయా! జింక మాంసం ఆర్య ఋషులు లొట్టలేస్తూ తింటారు కదూ. ఇది బాగా కొవ్వు పట్టిన తరువాత వీళ్లకు ఆహారం అవుతుంది కాబోలు. ఈ జింకపిల్ల ఆయుష్ను మొండిది! లేనట్లయితే నా కంటబడేదికాదు. దీని శరీరం మీది మచ్చలు ఎంత అందంగా వున్నాయి! ధృష్టవర్మా దీనిని నేను పెంచుకుంటాను. శునశ్శేఫా! ఏమిటి దిగులుగా చూస్తున్నావు? ఒకపూట మాంసం లేకపోతే ప్రాణమేమీపోదులే!

గౌతముడు : ఆర్యఋషుల్ని పరిహాసమాడితే ఆయుష్షు క్షీణిస్తుంది.

వేనుడు : గౌతమా! ఎంతకాలం యిటువంటి బెదిరింపులు? చివరి సారిగా చెప్తున్నా విను. నేను ధర్మపీడను మన్నింపను. తొలితప్పుగా భావించి వదిలేస్తున్నా. చిన్ని చిన్ని ఈ శిష్యులకు యిప్పటినుండే మాంసం రుచి చూపించాలా? మాంసం తినటాన్ని మాన్పితే జీవహింస లేకుండా పోతుంది. ఆ విధంగా లోకంలో శోకం లేకుండ చేయలేవా? ఆలోచించు.

ధృష్ట వర్మా ! పోదాం పద! ఇదిగో ఈ జింకపిల్లను పట్టుకురా!

## రెండవ రంగం

(వేనరాజు తల్లి సునీథాదేవి - గౌతముడు)

గౌతముడు : తల్లీ! అంగరాజు మరణం నిన్న మొన్న జరిగినట్లుగా భావించి యిప్పటికీ దిగులు పడుతున్నాం. భవిష్యత్తు కారు చీకటిగా కన్పించి మాకు భయంగా వుంది. ప్రశాంతి నిలయాలయిన మా ఆశ్రమాలు అల్లకల్లోలాలవుతున్నాయి. అంగరాజు రాజ్యంలో కూడ మాకీ గతి దాపురించింది. మా మొర ఆలకిస్తారేమోనని మీ వద్దకు వచ్చాను.

సునీథాదేవి : మా వేనుడి రాజ్యంలో దుండగాలా? పరమ సాధువులకు యిక్కట్లా! మా వేనుడు ఎక్కడ ఉన్నాడో? ఏం చేస్తున్నాడో? నా బిడ్డ ప్రాలుమాలే వాడుకాదే!

గౌతముడు : తల్లీ! కంచే చేను మేసేందుకు పూనుకుంది. మేమేం చేయగలం?

సునీథాదేవి : మా వేనుడు మీ పట్ల అపచారం తలపెట్టాడా? అదేమిటి వేనునికి భూతదయా రసాన్ని ఉగ్గుబాలతో కలిపి తాగించానే! చలిచీమను కూడ తొక్కి చంపడు! మీదికొచ్చే క్రూరజంతువు పైకి బాణం కూడ వేయడే! బీద సాదల్ని సాకేందుకు బద్ధకంకణుడయ్యాడే. అటువంటి వేనుడు ఋషులకు అపకారం తలపెట్టటమా?! ఎక్కడో, ఏదో పొరపాటు జరిగి వుంటుంది.

గౌతముడు : తల్లీ! ఈ విషయంలో పొరపాటు అనే దానికి తావేలేదు. మీకు సందేహం కలగటం మేము పూర్వజన్మలో చేసిన దాని ఫలితం కాబోలు. మొన్నటికి మొన్న మేము యజ్ఞం చేస్తూంటే, వేనుడు ఎక్కడి నుండో దూసుకు వచ్చి, కులపతులు బతిమాలినా వినకుండా, కట్టివేసిన మేకను విడిచిపుచ్చి, యజ్ఞ గుండాన్ని ఆర్పివేయించాడు.

సునీథాదేవి : మునీశ్వరా! మీ మాటలు యిప్పుడర్థమయ్యాయి. ఇదేగా మీరు కంచె చేను మేయటంగా చేసి చెప్పేది. అగ్ని గుండాన్ని ఆర్పి, మేకను విడిపించిన వేనుడు ఆశ్రమవాసులకు ఏమీ హాని తలపెట్టలేదుగా ...వేనుడు ఎందువల్లనో పొరపాటుగానయినా వైదిక ధర్మాన్ని మెచ్చుకోడు. మా వేనుడు పాపం చేయడు. చేయనివ్వడు.

గౌతముడు : పొరపాటు ఎక్కడో యింకా తెలియటం లేదా తల్లీ! వేనుడు ఆశ్రమానికి వచ్చి పరమపూజ్యులైన తపోధనులతో వితండవాదం చేశాడు. వాళ్లను తూలనాడాడు. "ఒక్క కట్టె యజ్ఞగుండలో పడిందంటే ఒక్క తల తెగిపోతుందని" బూకరించాడు. ఇంతకు పూర్వం మీ వంశంలో యిలా ఋషుల్ని తూలనాడినవాళ్లు అసలు వున్నారా?!

సునీథాదేవి : మునీశ్వరా! మా వేనుణ్ణి గురించి మాకు తెలిసినంతగా యితరులెవ్వరికీ తెలియదు. ఏయే పరిస్థితుల్లో అతడెలా వుంటాడో నాకు తెలుసు. ధర్మపీడను స్వయంగా చూశాడా అతడిని ఆపటం కష్టం. చిన్నప్పటి నుండి వేనుడంతే. మీ మనస్సుల్ని కష్టపెట్టకుండా మీకు నచ్చజెప్పి పనిపూర్తి చేస్తే బాగుండు. మాటలతో మిమ్మల్ని నొప్పించకుండా వుంటే బాగుండేది. నేను హెచ్చరిస్తానులే.

గౌతముడు : మీరు కూడ యిలా మాట్లాడటమేమిటి రాజమాతా?

సునీథాదేవి : నేనేమి కానిమాట చెప్పాను. మా వేనుడంతే. కొన్ని విషయాల్లో ఖచ్చితమైన అభిప్రాయాలను కలిగివుంటాడు. ఎవ్వరేమి చెప్పినా వినడు.

గౌతముడు : మా పుట్టి నట్టేట మునిగింది తల్లీ! యజ్ఞగుండాలను ఆర్పివేయటం, యజ్ఞ పశువును విడిపించటం, యజ్ఞాలను నిషేధించటం యివన్నీ తప్పులు కావనుకుంటున్నారా మీరు?

సునీథాదేవి : నేను ఏమనుకొని ఏంప్రయోజనం? మా వేనుని అభిప్రాయం కదా మీకు ముఖ్యం. అతడు మూర్ఖుడు కాడు. అతనికి పుణ్యమేదో, పాపమేదో తెలుసు. ఏది దోషమో, ఏది కాదో తెలుసు. మంచి చెడ్డలేవో తెలుసు. ధర్మాన్ని నిలబెట్టే విషయంలో అతనికి మొహమాటం వుండదు. అటువంటి వాడికి నేను అదనంగా తెలియజెప్పేదేముంటుంది.

గౌతముడు : ఇక్కడ ధర్మాన్ని నిలబెట్టే సంగతేమున్నది తల్లీ?

సునీథాదేవి : యజ్ఞములు హింసతో కూడినవి. అందువలన తన రాజ్యంలో వాటికి తావుండకూడదని పట్టుబడుతున్నాడు. దానిని నేనెలా అడ్డుకోగలను?!

గౌతముడు : అలా అయితే యిక మాకు దిక్కెవ్వరు? యజ్ఞాలు యిక ఆగి పోవలసినదేనా? వేనరాజు మొన్న ఆశ్రమానికి వచ్చి చిన్నపెద్ద తేడా లేకుండ, అద్దు అదుపు లేకుండ ప్రవర్తించాడు. మంచిని నిలబెట్ట వలసిన రాజే యీ విధంగా చేస్తే మాగతేంగాను?

సునీథాదేవి : యజ్ఞాలు హింసకు మూలమని, కనుక వాటిని ఆచరించేవాళ్లు మంచివాళ్లుగారని మా వేనుని వాదన. నేను చెప్పిచూడగలనేగాని అన్నీ అతనితో చేయించగలనా?

గౌతముడు : అతడు యితరులతో చేయించగలడు. అగ్గికి గాలితోడైనట్లు వేనుడికి సైన్యాధిపతి ధృష్టవర్మ తోడయ్యాడు. రాజుకు తగినబంటే. అగ్ని గుండాన్ని 'ఉఫ్' అని ఆర్పివేస్తాడు.

సునీథాదేవి : అయితే ధృష్టవర్మ నమ్మదగిన బంటే నన్నమాట ! సేవాధర్మం తెలిసి మసలు కొంటాడు కాబోలు!

గౌతముడు : అంగరాజ్యంలో ఋషులకు నిలువ నీడలేదా? మేము వలస పోవలసిందేనా తల్లీ! వయోవృద్ధులగు కులపతులకు అవమానమా? మేము బ్రతికి ప్రపంచానికేం ప్రయోజనం? రాజు వైదిక కర్మకాండను తిన్నగా జరిపించక పోగా వాటిని అడ్డుకుంటున్నాడు. అటువంటి కుమారుణ్ణి మీరు సమర్థిస్తున్నారు. మీ వంటి సాధ్వీమతల్లికిది చెల్లదు. వేనరాజు ఆకతాయియని లోకమంతా కోడై కూస్తున్నది. తల్లీ! బాగా ఆలోచించి చూడండి. ఇటువంటి పనులవల్ల మీకూ మాకూ యిద్దరికీ నష్టమే.

సునీథాదేవి : మాట తీరు మీది మారిపోతున్నది మునీంద్రా! బెదిరించి పని చక్కబెట్టుకోవా లనుకోవటం తప్పు. దానివల్ల లాభంలేదు.

గౌతముడు : క్షమించండి. నాకటువంటి వుద్దేశ్యంలేదు. మా కష్టాలను విన్నవించు కొంటున్నాం. మేము మిమ్ములను బెదిరించగలమా?

సునీథాదేవి : మా వేనరాజును వూరక అలా దూషించకండయ్యా. మీ వంటి వాళ్లు దూషింప దగినవాడు కాడతడు. అతనిలో ఒకవేళ అధర్మంకాని, దౌర్జన్యం కాని కన్పిస్తే నన్ను దూషించండి. అతని ప్రవర్తనకు నేనే బాధ్యురాలిని.

వేనుడు : (తెరలో) తల్లీ క్షమించండి. మీరెలా బాధ్యులు? నేను చేసే ప్రతిపనికి నేనే బాధ్యుణ్ణి. (ప్రవేశించి) ఆవేశంలో మరిచిపోయాను. మీకు నమస్కరిస్తున్నాను.

సునీథాదేవి : కుమారా! నిండు నూరేళ్లు జీవించాలి.

వేనుడు : నేను చేసే పనులకు మీరెలా బాధ్యతవహించగలరు మాతా! బాల్యంనుండి విద్యా బుద్ధులు నేర్పారు. వివేకాన్ని కలిగించారు. ఏది ధర్మమో, ఏది అధర్మమో గ్రహించే శక్తినిచ్చారు. ఏది దోషమో ఏది కాదో నిగ్గుదేల్చే విజ్ఞానాన్ని అందించారు. అంతవరకే మీ సంబంధము. తరువాత ధర్మ సంస్థాపన కోసం నాకు తోచినట్లుగా నేను ప్రవర్తిస్తాను. దాని ఫలితానికి పూర్తి బాధ్యత నాదే.

ఇంతకూ నేను చేసిన తప్పుయేమిటో?! గౌతమా! యిక్కడ యేమి తంత్రము పన్నుతున్నావు?

గౌతముడు : వేనరాజా! ఇక్కడ ఆవేశము, ఆక్రోశము అవసరం లేదు. మా యజ్ఞాన్ని మీరు ధ్వంసం చేశారు. మా గోడు రాజమాతకు విన్పించుకొంటున్నాం. దిక్కులేనివారికి ఆవిడే దిక్కని వచ్చాం. ఇంతలో అన్ని దుందుడుకు మాటలెందుకు?

వేనుడు : రాజమాత రాచకార్యాలలో జోక్యం కల్పించుకోదని మీకు తెలియదా? తెలిసి తెలిసి యింట్లో కల్లోలాన్ని సృష్టించి మమ్ము అలజడికి గురిచేయాలనేగా మీరు వచ్చింది. అది కుదరదులే.

గౌతముడు : ఇది రాచకార్యమా? మత విధ్వంసం రాచకార్యమెలా అవుతుంది? మేము నువ్వసలు రాజువు కాదంటున్నామా? నీ పెత్తనాన్ని వ్యతిరేకిస్తున్నామా?

వేనుడు : గౌతమా ! మత విధ్వంసమని గొంతెత్తి గగ్గోలు పెడతావెందుకు? మతం లేక పోతే మానవుడికి ముక్తిలేదా? మోక్షంలేదా? నిర్యాణంలేదా? మతం పేరుతో యెంతమంది వొకళ్ల గొంతులు వొకళ్లు కోసుకోలేదు? పరస్పర మారణ హోమాలకు మతమే కారణంకాదా? మతాన్ని సాకుగా జేసుకొని యజ్ఞమని, యాగమని, బలని, మ్రొక్కుబడని చెప్పి ప్రతిరోజూ యెన్ని వేల సాధు మృగాల్ని చంపేస్తున్నారో! ఆ యజ్ఞ పశువుల రోదన వినగానే నిలువున నీరైపోతున్నాను. వాటి యేడుపు నా చెవిన బడగానే కంటినిండ నిద్రుండదు. కడుపు నిండ తినలేను.

గౌతముడు : వేనరాజా! నీదంతా వెర్రి వేదాంతము! నీ మాటలు సృష్టి విరుద్ధం. ప్రాణిహింస పనికి రాదంటావు; హింస చేయకుండ అసలు బ్రతికే దెవడు? జీవరాశులన్నీ ఒక దాని నొకటి తింటూ బతకటం లేదూ? ఈగను కప్ప, కప్పను పాము, పామును నెమలి, నెమలిని వేటకాడు రోజూ చంపి తింటూ వుండటం మనం చూడటంలేదా? మరి నువ్వెందుకు రాజా యేటికి యెదురీదటం?!

వేనుడు : సృష్టి స్వభావమని చెప్పి జంతువుల్లా ప్రవర్తిస్తామా? వాటి ప్రవర్తననే నెత్తికెత్తు కొంటామా? సరే నీ వాదనే సరైనదనుకుంటే దీనికేమంటావు – పాములు, తోడేళ్లు, పెద్దచేపలు, తిమింగలాలు వాటిపిల్లల్ని తినేస్తాయి. అలాగే మనం కూడ ఒకళ్ల నొకళ్లు పీక్కుతినాలా? నాలుగు కాళ్ల జంతువులకు వావి వరసలుండవు; ఆడ మగ తేడా మాత్రమే. మనమూ అలాగే ప్రవర్తించాలా?

చదివావు, చదువు చెప్తున్నావు. అయినా నీ ఆలోచన మారదేం? ఆహారం, నిద్ర, భయం వంటివి మానవులకు, జంతువులకు ఒకటిగా వున్నా మానవుడు విజ్ఞానాన్ని సొంతం చేసుకొన్నాడు. అందువల్ల మానవుడికి, మిగతా జంతు జాలానికీ తేడా వుంటుంది.

గౌతముడు : మహారాజా! నీవు చెప్పిందే నిజమనుకుందాం. పశుపక్షి క్రిమి కీటకాదులు భగవంతుని ధ్యానింపలేవు. మానవుడొక్కడే ఆ విధంగా చేయగల సమర్థుడు. భగవంతుని కొరకు తలపెట్టే కార్యాలను చెడ్డవని నిర్ణయించే అధికారం నీ కెక్కడిది?

వేనుడు : రాజుకు లేని అధికారమేముంటుంది? నా ప్రజల సౌభాగ్యాన్ని వర్ధిల్లజేయటం నా ధర్మం. భగవంతుని పేరిట పాపకార్యాలు చేస్తే అవి పుణ్యకార్యాలయిపోవు. ఇతర జంతువులను బలియిచ్చి భగవంతుణ్ణి సంతృప్తి పరిచే బదులు తనని తాను అర్పించుకోవటం అత్యుత్తమం కదా! అలా యెందుకు చేయరు. జంతువుని బలియిచ్చి భగవంతుణ్ణి మంచి చేసుకోవటం అనేది జ్ఞానం గల మానవుడు చేసే పనేనా? ఇకనైనా యజ్ఞాలను కట్టిపెట్టు.

గౌతముడు : రాజా! నీకు ఆ మాటతప్ప మరోమాట తెలియదా! మేము కన్నీటితో అంగరాజ్యానికి తిలోదకాలర్పించి పరసీమలకు పయనమై పోవలసిందేనా! తరతరాల నుండి ఆచరించే జపం, తపం, దానం, ధర్మం, యజ్ఞం, యాగం ఆగిపోవలసిందేనా? అడవులలో, మునిపల్లెలలో కాయకసరులు తింటూ వాటిని ఆచరించే జీవనం మాకిక లభించదా?

వేనుడు : గౌతమా! ఒక్క ప్రాణహింసను కాదన్నాను కాని మీ ప్రశాంత జీవనాన్ని కాదన్నానా? మీ జ్ఞానంతో, విజ్ఞానంతో లోకాన్ని నిత్యకల్యాణం, పచ్చతోరణంగా మార్చండి. మీరానందించండి; మమ్మానంద పరచండి. ఒక్క జంతువు ఆక్రందన విన్నా నా గుండెలవిసిపోతాయి గౌతమా! నా తీరే అంత. చివరగా చెప్తున్నా విను – లోకం నేను చెప్పినట్లు చేసి ఆనందమయమైనా కావాలి, అలా కాకుంటే ఈ లోకాన్నుండి నేనయినా నిష్క్రమించాలి; మరోమార్గం లేదు.

సునీథాదేవి : కుమారా! అవేం మాటలు? ఇవ్వాళగాక పోయినా యింకో రోజుకైనా నీ కోరిక నెరవేరకమానదు.

వేనుడు : మీ ఆశీస్సులు చాలునాకు. ఈ వ్యర్థవాదాలతో పనిలేదు. సెలవిస్తే వెళ్లివస్తా.

సునీథాదేవి : కుమారా! అప్రమత్తంగా వుండటం మరచిపోకు.

వేనుడు : చిత్తము (నిష్క్రమించును.)

గౌతముడు : నాకేమి సెలవిస్తారు?

సునీథాదేవి : మహారాజు నిశ్చితాభిప్రాయాలను విన్నాంకదా! (నిష్క్రమించును)

గౌతముడు : దిక్కులేనివాడికి దేవుడే దిక్కు, మహారాజు వాక్యములే మాకు దారి చూపుచున్నవి. ఆయన చెప్పిన దానిలో మొదటిది లోకం ఆయన చెప్పినట్లు చేసి ఆనందమయం కాకూడదు. ఇక రెండవది ఈలోకం నుండి ఆయన నిష్క్రమించటమే జరగవలసి వుంది. అలా జరగకపోతే మాకు శుభం జరగదు. సేనాపతి అతి మూర్ఖుడే కాని అత్యంత సాహసి. ముందు చూపేగాని ప్రక్క చూపులేదు, అటువంటి వాని ద్వారా కార్యసాధన సులువు.

## మూడవ రంగం

(శునశ్శేఫుడు బైరాగి వేషములో సితారు వాయిస్తూ, పాడుతూ
రాజవీధిలో తిరుగుతూ వుంటాడు)

కులములన్నిటిలోను వినరా
బ్రహ్మకులమే కులమురా!
బ్రహ్మకులమును మించినట్టిది
పాఱ జూచిన లేదురా!
"బ్రాహ్మణో మమ దేవతా"యని
పరమ పురుషుడు చెప్పడే
బ్రాహ్మణోత్తము సేవజేసిన
బ్రహ్మపదమే వచ్చురా!

(ధృష్టవర్మ ప్రవేశము)

ధృష్టవర్మ : ఏమి యీ చిత్రము! మా మహారాజు రేయనక, పగలనక, వాననక, వంగుళ్లనక, దేశమెల్ల తిరుగుతూ, బీదసాదల జాలిపాటలు ఆలించి, లాలించి, పాలించినా విశ్వాసము కుదరకుండా వుంది. ప్రజలు నివురు గప్పిన నిప్పులా వున్నారు. ఎప్పుడు భగ్గుమంటారో! నేనెంత జాగ్రత్తగా వుండి రాజశాసనాన్ని ప్రజలకు విప్పి చెప్పినా వినేవారే కరువయ్యారు. రోజు రోజుకు విరోధుల సంఖ్య పెరిగిపోతున్నది. ఋషులు రకరకాల ఉపాయాలతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. ఏదో ఒక రోజు ఈ మూఢులు నా ప్రాణమూ బలిగొంటారు.

శునశ్శేఫుడు : లోకమంతయు చిమ్మ చీకటి
చిమ్ముచుండెనుమేలుకో!
వర్ణధర్మము కూలిపోయెను
వేదధర్మము కాలిపోయెను

రాజు, రైతు ఒక్కటేనట
కాని కాలమువచ్చె నేటికి!

ధృష్టవర్మ : ఓయీ! నీ వెవ్వరవు?

శునశ్శేఫుడు : (పై పాటనే పాడుచుండును)

ధృష్టవర్మ : పిలిచిన పలకకుండా పాడుతున్నావు...అసలు నువ్వెవ్వరివయ్యా, వేన రాజ్యంలో యిటువంటి పాటలా? ఇలాంటి పాటలు పాడితే తల తెగిపోవలసిందే.

శునశ్శేఫుడు : ఎందువల్ల?

ధృష్టవర్మ : ఇటువంటి పాటలు మానవులంతా సోదరులు అనే భావాన్ని చెడగొడతాయి; అసంతృప్తిని పెంచుతాయి; హింసను ప్రేరేపిస్తాయి; భూతదయను అరికడతాయని మా రాజు గట్టిగా నమ్ముతారు. ఎచ్చులొచ్చులను ప్రేరేపించే పాటలు ఈ రాజ్య ప్రజల చెవి సోకరాదు. ఈ శాసనం ధిక్కరించ వీలుకానిది.

శునశ్శేఫుడు : పాటలు పాడితేనే యింత పెద్దశిక్షా? ఈ పాటలు మా తాత మా తండ్రికి నేర్పగా ఆయన నాకు నేర్పారు. ఏదో పొట్ట నింపుకునేందుకు దేశమంతా తిరుగుతూ యివి పాడుకొంటున్నా. ఇక్కడుండే నాల్గునాళ్ల కోసం కొత్త పాటలేం నేర్చుకోగలను? (మళ్ళీ పాట)
తనువు సత్యము కాదురోరన్నా
ధర్మ మొక్కటె నిత్యమోరన్నా
తనువు శాశ్వతమనుచు లో నమ్మి
తప్పుదారుల ద్రొక్కబోకన్నా!

ధృష్టవర్మ : నేనడిగేదొకటి, నువ్వు చెప్పేదొకటి. పదాలతో పాటలతో తప్ప చెప్పలేవా? సరైన సమాధానం చెప్పించమంటావా?

శునశ్శేఫుడు : అంత కోపందేనికి? అలవాటువల్ల పాటలు వాటంతట అవే వచ్చేస్తున్నాయి. ఇంతకూ మీకేం కావాలి? అడగండి, చెప్తాను

ధృష్టవర్మ : మీ ఊరేది!

శునశ్శేఫుడు : మాది ఉత్తరాది.

ధృష్టవర్మ : ఇంతలోనే అబద్ధమా?!

శునశ్శేఫుడు : మాది బ్రహ్మముఖము; బ్రహ్మముఖమన్నా, ఉత్తరాది అన్నా అర్థం ఒకటే.

ధృష్టవర్మ : ఇంతకూ అదెక్కడ వుందయ్యా?

శునశ్శేఫుడు : బ్రహ్మ కపాలం దిగువన.

ధృష్టవర్మ : చిత్రంగా వుందే! ఇంతకీ నువ్వు యీ పట్టణం వచ్చి యెన్నాళ్లయ్యింది!

శునశ్శేఫుడు : రెండు మూడు వారాలయ్యింది.

ధృష్టవర్మ : ఇన్నాళ్లు ఎక్కడ వున్నావు?

శునశ్శేఫుడు : ప్రక్కనే వున్న మునిపల్లెలో, పగలు బిచ్చమెత్తుకు తిని, రాత్రిపూట మునుల సేవజేస్తూ కాలం గడుపుతూ వుంటాను.

ధృష్టవర్మ : ఓహో నువ్వు అటువంటి పాటలు పాడటానికి కారణం యిదా? మునిపల్లె మహారాజుకు వ్యతిరేకమని నీకు తెలియదా? తగాదా మారి మునులవల్ల పట్టణంలో యింత అలజడి; మహారాజును తల్లక్రిందులు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. వాళ్లు చేసే శాసనధిక్కారానికి అంతులేదు.

శునశ్శేఫుడు : అయ్యో! ఈ గొడవలు నాకసలు తెలియనే తెలియవు. ఒట్టు, తెలిసి తెలిసి నేను అగ్నిగుండంలో దూకలేను.

ధృష్టవర్మ : మునులుగాక యింకెవ్వరు యిటువంటి పాటలు నీకు నేర్పే సాహసం చేస్తారు?

శునశ్శేఫుడు : నా మాట నమ్ము. ఈ పాటలు నాకు మునులు నేర్పలేదు.

ధృష్టవర్మ : ఏమిటి నమ్మేది. నాకు అంతా తెలుసు. వాళ్లు నీకీ పాటలు నేర్పి పట్టణంలోకి పంపి పాడితే ఏం జరుగుతుందో చూడాలనుకున్నారు. నేను బ్రతికున్నంతకాలం ఎవడయినా సరే రాజశాసనాన్ని ధిక్కరిస్తే మరుక్షణమే వాడి వూపిరి గాలిలో కలిసి పోతుంది.

శునశ్శేఫుడు : ఇంతకూ తమరెవరు? సెలవిచ్చారుకారు.

ధృష్టవర్మ : వేన మహారాజు సర్వసైన్యాధిపతిని. ఆయన ఆత్మీయుణ్ణి.

శునశ్శేఫుడు : తమరెవరో తెలియక యిలా మాట్లాడాను. ఇంక నేనీ పాటలు పాడను. మునిపల్లె గడప తొక్కను. ఋషులెంత దొంగలు. ఈ పాటపాడితే ప్రాణాలు పోతాయని చెప్పనే లేదే. అయ్యా మీరు నాతో రండి. మునిపల్లెకు వెళ్లి వాళ్లు అలా యెందుకు మోసం చేసారో కనుక్కుందాం.

ధృష్టవర్మ : (ముందు తటపటాయించి, తరువాత) సరేపద; వాళ్లేమి చెప్తారో విందాం.

శునశ్శేఫుడు : మీరు అంగీకరించినందుకు ధన్యుణ్ణి. అసలు విషయం తేలిపోతుంది.

అయినా మునులకీ గొడవలు ఎందుకో? రాజు కన్నుదెరిస్తే వాళ్లు మలమల మాడిపోరూ?!

ధృష్టవర్మ : రాజు అలాకన్ను తెరిచేవాడు కాదు కాబట్టే మునుల ఆగడాలు సాగుతున్నాయి. దీనికి తోడు కాలం కూడ తలక్రిందులవుతున్నట్లుగా వుంది. కొత్తపాతల పోరాటంలో ప్రజలు నలిగి పోతున్నారు.

శునశ్శేఫుడు : మెత్తని రాజును చూచి భయపడే వాళ్లెవరుంటారు? ఆయన శాసనాలను గౌరవించే వాళ్లెవరుంటారు?

ధృష్టవర్మ : ఇప్పుడీ రాజ్యంలో జరుగుతున్నది అదే. పోదాంపద

(వెళ్తారు)

(మునిపల్లె–గౌతముని కుటీరము–ధృష్టవర్మ, శునశ్శేఫుడు ప్రవేశిస్తారు)

శునశ్శేఫుడు : స్వామీ! అదిగో అదే గౌతమ ముని కుటీరం. ఆయన ఈ మునిపల్లెకు కులపతి. చాల పెద్దవారు. శాస్త్రాలన్నీ తెలిసిన పండితులు. ఆయన్ని చూద్దాంరండి.

ధృష్టవర్మ : ఆయన్ని నేను యింతకు ముందెప్పుడో చూశాను. ఆయన వితండవాదం చేసేవానిగా కన్పించారు

శునశ్శేఫుడు : ఆయన అటువంటి వారు కారు. వారు వాదించే తీరు అద్భుతం. విన్నవారు ఆయన పక్షానే నిలుస్తారు.

ధృష్టవర్మ : బహుశా మా వేనమహారాజు తప్పు!

శునశ్శేఫుడు : ఒకరి వాదాన్ని మరొకరు వినసే వినరు కాబోలు!

ధృష్టవర్మ : విన్నా ఒకరిమాట ఒకరికి నచ్చదు. సరే మనకెందుకులే ఈ విషయంలో వాదం. పోదాంపద.

గౌతముడు : ఎవరినో తీసుకొస్తున్నావే (పరిశీలించి చూచి) ఒహో! దండనాథులా! ఈ దర్భాసనం మీద కూర్చోండి. కూర్చుండ మాయింట సోఫాలుండవు.

ధృష్టవర్మ : మునీంద్రా! వీటిమీద కూర్చుంటేనే సుఖంగా వుంటుంది. ఈ చెట్టు కింద చలి పందిరి కింద వున్నట్లుంది. ఇక్కడ ఈ ఆశ్రమం ఎంతో ప్రశాంతంగా వుంది.

గౌతముడు : ఆశ్రమం ప్రశాంతమే. మా మనస్సుల్లోనే కల్లోలం. ఈ చెట్లనీడలో వేదాల్ని చదువుకునే అవకాశం కూడా యిక ముందుండేట్లు కన్పించటం లేదు.

ధృష్టవర్మ : కలిమిలేములు, కష్టసుఖాలు కావడికుండలు కదా! అది మీకు బాగా

తెలిసిన విషయమే గదా.

శునశ్శేపుడు : మునీంద్రా! మొన్న మీ ముందు పాడిన పాట రాజద్వేషాన్ని పురికొల్పుతుంది. నా తల నరుకుతానని ఈయన అంటే ఏమి చేసేందుకు పాలుపోక ఆయన్ని బతిమాలి యిక్కడకు తీసుకొనివచ్చా. అటువంటి పాటలు పాడకూడదని మీరు నాకెందుకు చెప్పలేదు? నిజంగా నా తలతెగగొడితే నేనెక్కడ వుండేవాడిని?

గౌతముడు : నిజంగా అటువంటి పాట అయితే మేము చెప్పమా? రాజుపట్ల వైరం మాకెందుకుంటుంది. " నా విష్ణుః పృథివీపతి" అంటే రాజే దేవుడిక, మా పెద్దల మాట మాకు తెలియనిది కాదుగా.

ధృష్టవర్మ : మీకు తెలియనిదేమీలేకపోవచ్చునుగాని అంతరార్థాలు, విపరీతార్థాలు అవసరాన్ని బట్టి చెప్పి, దేనినైనా సమర్థించి సరిపుచ్చగలరనే భయమే మాది!

గౌతముడు : ధృష్టవర్మా! అటువంటి భయం నీకుండకూడదు. పాపభీతి, దైవభీతి కలిగిన మేము పాపపు పనుల్ని ఎవరికయినా నూరిపోస్తామా?

ధృష్టవర్మ : చూచే చూపు వేరయినప్పుడు మీ దేవుడికి, మా దేవుడికి; మీపాపానికి మా పాపానికి తేడా కన్పించదా?

గౌతముడు : మనం అందరం పాటించే ధర్మం ఒకటే అయినప్పుడు తేడాలు ఎందుకు కన్పిస్తాయి? సరే ఈ వాదాన్ని అలా వదిలేద్దాం. మనందరి సనాతన ధర్మానికి మూలం వేదం. వైదిక ధర్మాన్ని మనం పాటిస్తే తేడాలెందుకు వస్తాయి?

ధృష్టవర్మ : వేదాలలో మాత్రము పరస్పర విరుద్ధమైన విషయాలుండకూడదా?

గౌతముడు : అలా వుండకూడదు. వేదాలను లోక కల్యాణం కోసం భగవంతుడు పూర్వం మహర్షులకు యివ్వటం జరిగింది.

ధృష్టవర్మ : పూర్వం అంటే?

గౌతముడు : సృష్టి మొదలైనప్పుడు.

ధృష్టవర్మ : సృష్టి ప్రారంభమైనప్పుడు కొంతమంది ఋషులున్నారని వాళ్లకు భగవంతుడు బోధించారని మీరు చెప్తున్నారు. వేదాలే లేని కాలంలో ఋషులెక్కడినుండి వచ్చినట్లో!

గౌతముడు : వేదాలలోనే ఆవివరాలన్నీ వున్నాయి.

ధృష్టవర్మ : వేదాలు ఎలా పుట్టింది, అవి ఋషుల మనస్సుల్లోకి యెలా యెక్కింది కూడ అవే చెప్పుకున్నాయా? కథ బాగానే అల్లారు. అటువంటి కథలతో పిల్లల్ని నమ్మించవచ్చు. సరే దాన్నలా వదిలెయ్యండి. మీరు చెప్పదలిచింది చెప్పండి.

గౌతముడు : వంశ పారంపర్యంగా మాకు భగవంతుడు ప్రసాదించగా మా ఆధీనంలో వున్న వేదాలు చెప్పేదానికి వాటి ప్రచారానికి మేము యెల్లప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటాం.

ధృష్టవర్మ : ఈ పని యెవరయినా చేయదగినదేగా?

గౌతముడు : ఎవ్వరయినా చేయవచ్చును కాని భగవంతుడు వేద ధర్మాలను నెలకొల్పటానికి రాజులను సృష్టించి అధికారాలన్నీ వాళ్లకు అప్పగించటం జరిగింది.

ధృష్టవర్మ : పెద్ద చిక్కే తెచ్చిపెట్టారే! మా వంటివాళ్లం ఆ ప్రచారానికి తగమా?

గౌతముడు : అటువంటి అధికారం రాజులకు మాత్రమే అప్పగించబడింది. రాజులు వాళ్ల విధిని తిన్నగా నిర్వహింపని సందర్భాలలో వాళ్లకు నచ్చచెప్పో భయపెట్టో వైదిక ధర్మాన్ని నిలబెట్టేట్లు చూడవలసినవాళ్లు వైదికులు.

ధృష్టవర్మ : రాజులు, బ్రాహ్మణులు తప్ప యితరులెవ్వరూ మత ప్రచారము చేయరాదన్నమాట! ఒకవేళ మత విప్లవాలు చెలరేగితే రాజు వాటిని అరికట్టలేకపోతే?

గౌతముడు : రాజును శిక్షించాల్సి వుంటుంది.

ధృష్టవర్మ : రాజును శిక్షించేదెవరు?

గౌతముడు : ఈ లోకంలో బ్రాహ్మణులు, పరలోకంలో భగవంతుడు.

ధృష్టవర్మ : ఒక తప్పుకు రెండు శిక్షలా?

గౌతముడు : ఒకటి తప్పించుకుంటే రెండోది.

ధృష్టవర్మ : ఓహో! చచ్చినను శిక్ష తప్పదన్నమాట! ఒకవేళ బ్రాహ్మణులు అజాగ్రత్తగా వదిలేస్తే?

గౌతముడు : వాళ్లనూ దండించవలసిందే. అందుకే వేనరాజు వ్యతిరేకించినా మేము వేదాలను నిలిపే ప్రయత్నం చేస్తున్నాం. రాజభక్తి, దైవభక్తి ప్రేరేపణగా మే మీ పనులు చేస్తున్నాం. మహారాజు కోపంతో ఏమేమిటో చేస్తున్నాడు.

రాజు అటువంటి పరిస్థితుల్లో చంపబడతాడు.

ధృష్టవర్మ : రాజును చంపటమా! ఇటువంటి మాట నేను వినరాదు. ఎవ్వరూ అటువంటి మాట నా ముందు అనరాదు.

గౌతముడు : వినరానిదైనా వినిపించవలసి వచ్చినందుకు బాధగా వుంది. ఇటువంటి విషయంలో మొహమాటం పనికిరాదు. ఇటువంటి పనుల్లో రాజుకు సహకరించే వాళ్లను సైతం హతమార్చాలని వేదాలు ఘోషిస్తున్నాయి.

ధృష్టవర్మ : నా రాజుకోసం నా ప్రాణాలు పోతే పోయాయికాని ఒక్క విషయం చెప్పండి. వేనరాజు ఆచరించే ధర్మాలు వేదానికి వ్యతిరేకమా?

గౌతముడు : వేదాలు చెప్పినట్లుగానే మేము యజ్ఞ యాగాలు చేస్తున్నాం. వేనరాజు వాటిని నిషేధించాడు. మరి ధర్మవిరుద్ధంకాదా?

ధృష్టవర్మ : అయితే జీవహింస వేద సమ్మతమన్నమాట!

గౌతముడు : యజ్ఞాలలో చేసే హింస హింసకాదని వేదాలు చెప్తున్నాయి.

ధృష్టవర్మ : అలా అయితే మహారాజు భగవంతుని పట్ల అపచారం చేస్తున్నట్లా?

గౌతముడు : నిస్సందేహంగా!

ధృష్టవర్మ : అయ్యో! పరుల బాగుకోరి జీవించే వేనుడు స్వార్థం కోసం ఎటువంటి పనికూడ చేసియెరుగడే. ఈ ప్రపంచం దుఃఖమయమని ఆ దుఃఖాన్ని తొలిగించాలనీ పాటు పడుతున్నాడే.

గౌతముడు : మానవ మాత్రునికి యిది సాధ్యమయ్యే పనేనా? అందులోనూ భగవంతుణ్ణి వ్యతిరేకించి?! యజ్ఞాలు, యాగాలు వద్దంటే ప్రజలలో కలిగే కలవరం కన్పించటం లేదా?

ధృష్టవర్మ : నిజమే! ఎక్కడ చూచినా రాజుకు విరోధులే. ప్రజలు అమితంగా కలవరపడుతున్నారు.

గౌతముడు : ప్రజలు చెలరేగి విప్లవకారులై రాజవంశానికి ముప్పు కలిగిస్తారని అమితంగా బాధపడుతున్నా. అంగరాజు పేరు తలిస్తే చాలు నిర్వేదానికి గురవుతుంటాను.

ధృష్టవర్మ : ఈ మాటలు నాలో కలతను పెంచుతున్నాయి. అంగ రాజవంశం ఈ ముప్పు నుండి బయట పడేదెట్లా? ఏది ఏమయినా ఈ ముప్పు నుండి తప్పించవలసిన బాధ్యత వారి ఉప్పుతిన్న మాకున్నది. వేనరాజు చేతిలో బడి అంగరాజు సింహాసనమునకు ఈ దుర్గతి దాపురించింది.

గౌతముడు : మేము ఛాందసులం కదా! మేమేమి చెప్పగలం? అయినా ఎల్లప్పుడూ

జపతపాలలో మునిగితేలే మాకెందుకీ గొడవలు?

ధృష్టవర్మ : అలా పట్టించు కొనకుండా వుండటం మాకెలా కుదురుతుంది? రాజులు వస్తారు, పోతారు. రాజవంశం సుస్థిరంగా సింహాసనం మీద కూర్చొని పాలించవలసిందే. మేము కోరుకునేది యిదే. రాజవంశానికి మేము ఎటువంటి అపకారాన్నీ తలపెట్టం

గౌతముడు : ధృష్టవర్మా! అంగరాజు మా పట్ల కూడ ఎంతగా దయాదాక్షిణ్యాలు చూపారో అది మేము మరచిపోగలమా? మేమంటే ఆయనకు ఎంతటి గౌరవం? అటువంటి మహారాజు వంశానికి మేము నష్టం వాటిల్లాలను కుంటామా? మేము పడే పాట్లన్నీ కూడ రాజవంశాన్ని కాపాడేందుకే.

ధృష్టవర్మ : అటువంటి పనిలో మీకు చేదోడు వాదోడుగా వుంటాను.

గౌతముడు : ధృష్టవర్మా! ఒక్క విషయం చెప్పు. పృథుకుమారుడు వినయ సంపన్నుడని, ఆచారశీలుడని, వంశ సంప్రదాయాలను పాటిస్తాడని వింటూంటాం. అందులో నిజమెంత?

ధృష్టవర్మ : సమయానికి భలేమాట గుర్తుకు తెచ్చారు. పృథువు యోగ్యుడు. వైదిక పక్షపాతి. ఒకసారి మీ దగ్గరకు తీసుకొస్తా. స్వయంగా మీరే బాగా తెలుసుకోవచ్చు.

గౌతముడు : పృథుకుమారుడు యిక్కడకు రావటానికి మహారాజు అనుమతిస్తాడా?

ధృష్టవర్మ : అంగీకరించడనే నేనూ అనుకుంటాను. అయినా ఫర్వాలేదు; ఆయనకు తెలియకుండ నేను పృథువును యిక్కడకు తీసుకువస్తా. అప్పుడు మీరు మాట్లాడవచ్చు. అతడు చురుకైనవాడు.

గౌతముడు : నీ ఆలోచన మంచి ఆలోచనే.

ధృష్టవర్మ : నేను వెళ్లివస్తా

గౌతముడు : అలాగే! (ధృష్టవర్మ నిష్క్రమించగానే) పని పాకాన పడింది!

## నాల్గవ రంగం

(వేనుని పడక గది)

(వేనుడు ఆలోచనల్లో మునిగి తేలుతూ అటూ యిటూ తిరుగుతుంటాడు; ప్రవేశించిన సునీథాదేవిని చూచి వేనుడు నివ్వెరపోతాడు!)

వేనుడు : అమ్మా! యిదేమిటి... ఇంత ప్రొద్దుపోయి యిక్కడికి వచ్చారేమిటి? ఎందుకు అలా తత్తర పడుతున్నట్లు కన్పిస్తున్నారు?

సునీథాదేవి : నిద్రపోకుండా దేనికో ఆందోళన చెందుతున్నట్లుగా అన్నంవండి వడ్డించే అమ్మాయి చెప్పింది. కనుక చూచి పోదామని వచ్చాను.

వేనుడు : అదేమిటమ్మా! నేను ఆందోళన పడటమేమిటి? ఆందోళన పడవలసిన అవసరం నాకేమున్నది?

సునీథాదేవి : మరి ఆ వంటలక్క అలా యెలా చెప్పింది? నువ్వేదో భిన్నంగా కన్పించి వుండి వుండాలి.

వేనుడు : ముందు ముందు చేయవలసిన పనుల్ని గురించి ఆలోచిస్తున్నాను. అంతే. వేరే యింకేమీ లేదమ్మా.

సునీథాదేవి : అంత తొందర పనులేమున్నాయి? ఏమిటా విశేషాలు?

వేనుడు : తొందరాలేదు, విశేషాలూలేవు. కాని అమ్మా ఒక విషయం అడుగుతా – సమాధానం చెప్తావు కదూ. పృథువును రోజంతా కనిపెట్టుకొనే చూస్తున్నావా?

సునీథాదేవి : అదేమిటినాయనా అటువంటి ప్రశ్న అడుగుతున్నావు? మన చిరంజీవి విషయంలో నేను ఎలా అశ్రద్ధచూపగలను?

వేనుడు : అదికాదమ్మా! పృథువు యీ మధ్య తరచుగా మునిపల్లెకు వెళ్తున్నట్లుగా తెలియవస్తూంది.

సునీథాదేవి : (ఉలికిపడి) ఏమిటీ మన పృథువా? మునిపల్లెకా? చిత్రంగా వుందే.

వేనుడు : రెండు మూడు సార్లు సేనాపతి ధృష్టవర్మతో కలిసి వెళ్లాడట. అలా వెళ్లటమేకాదు మునులతో మాట్లాడాడట కూడ.

సునీథాదేవి : పృథువు మునులతో మాట్లాడే అవసరం యేముంది? ఈడా, జోడా? ముసలితనంలో పోవలసిన మునిపల్లెకు యిప్పుడెందుకు పోతున్నాడు?

వేనుడు : మునులు యింకేం మాట్లాడతారు? నన్ను గురించి నా పనుల గురించేగా! ఇంతకు మించి వాళ్లకింకేం పనుంది?

సునీథాదేవి : ధృష్టవర్మ యెదుట వాళ్లు అవన్నీ మాట్లాడగలరా? అలా మాట్లాడితే అతను అలా నిమ్మకు నీరెత్తినట్లు వుండిపోతాడా? నీకు చెప్పకుండా వుంటాడా?

వేనుడు : అమ్మా! నీకు విషయాలు పూర్తిగా తెలిసినట్లు లేవు. అతడు మునుపటి సేనాపతికాదు. రాచకార్యాలలో అశ్రద్ధ చూపటమేగాక నాకు అనుకూలంగా నడుచుకోవటం లేదు.

సునీథాదేవి : కానికాలం వస్తే గడ్డిపోచ పామై కరుస్తుందట, అట్లా వుందే అతడి వ్యవహారం.

వేనుడు : పృథువు నాపై తిరగబడేట్లు మునులతో చెప్పించేందుకే ధృష్టవర్మ అలా చేస్తున్నాడని నా అనుమానం. అనుమానమేముందిలే అది వాస్తవమే.

సునీథాదేవి : ఔరా! ధృష్టవర్మ ఎంత పెద్దవాడయ్యాడు? అన్నంపెట్టే చేతినే కొరక దలచుకున్నాడా? నేను పిలిపించి మాట్లాడతానులే.

వేనుడు : వద్దమ్మా! అలా చేయకు. నీవు చెప్పినంత మాత్రాన తనపని మానుకునే రకం కాదు అతను. అతనికి మంచి చెడ్డలు తెలియవు. చేతిలోని కత్తి మంచి చెడ్డలు తెలిసినంతగా చేయబోయే పని మంచి చెడ్డలు తెలిసినవాడుకాదు. ఆ మనిషిదంతా మొసలిపట్టు.

సునీథాదేవి : అలా అయితే మరి నువ్వే మాట్లాడు. అతడు వినకపోతే, విషయం మితి మీరకముందే శిక్షించి, నీ దారికి అడ్డులేకుండా చేసుకోవచ్చుగా

వేనుడు : ఎందుకమ్మా నేనతణ్ణి శిక్షించటం? మీరు చెప్పినమాట విననప్పుడెల్లా మీరు నన్ను శిక్షించారా?!

సునీథాదేవి : నీవు అతణ్ణి శిక్షింపకుండా వదిలేస్తే రాజ్యంలో విప్లవం రాజుకోదా? ప్రాణానికే ముప్పువాటిల్లదా?

వేనుడు : తల్లి ప్రేమ నీతో యీ మాటలు పలికిస్తున్నదిగాని, నాకు ప్రాణహాని కలుగుతుందనే స్వార్థ బుద్ధితో ధృష్ట వర్మను నేనెందుకు శిక్షించాలి?

సునీథాదేవి : ముక్కుపచ్చలారని పసివానికి ఏమేమిటో నూరిపోసి, చెడుమార్గం పట్టించి కుటుంబ కలహాన్ని తెచ్చిపెడుతున్నాడు గదా ఆ సేనాపతి.

వేనుడు : ఎవరి అభిప్రాయాలను వాళ్లు నిరాఘాటంగా వెలిబుచ్చేందుకు, యితరులకు నచ్చజెప్పి తమవైపుకు తిప్పుకునేందుకు నా రాజ్యంలో అందరికీ అవకాశం వుంది. కనుక ధృష్టవర్మ చేస్తున్న పనిని నేనెందుకు కట్టడి చేయాలి? పైగా మనం ఏదైనా ఈ పని చేయరాదని ధృష్ట వర్మకు చెప్పటమంటే అతనిని రెచ్చగొట్టటమే.

సునీథాదేవి : కుమారా! యిటువంటి క్లిష్ట పరిస్థితుల్లో నీవేం చేయదలిచావు?

వేనుడు : చేసేందుకేమున్నది. బహుశా మునులు ధృష్టవర్మతో కలిసి పృథువుకు రాజ్యకాంక్ష కల్పించి శివమెక్కించి వుంటారు. కనుక అతడు కూడ మన మాట వినకపోవచ్చును. ఇక నాకా రాజ్యకాంక్ష తీరిపోయింది. ప్రజలకు విజ్ఞానము బోధించి మంచిత్రోవనబెట్టి వారి హక్కులేవో వారికి తెలియజేసే ప్రయత్నాలు రకరకాలుగా చేశాను. అది కాని పనిగా తేలిపోయింది. ప్రజలు తమకుయేది మంచో యేది చెడో గ్రహించే స్థితిలోలేరు. ఎవరికోసం నా జీవితాన్ని మొత్తం ధారవోసి అభ్యుదయాన్ని అందించే ప్రయత్నం చేశానో వాళ్లు దానిని అందుకునేందుకు సుముఖంగా లేరు. జాగ్రత్తగా దీనిని గమనించిన మునులు పరలోక సౌఖ్యాలను సృష్టించి అడియాసలు కల్పిస్తున్నారు. ప్రజలు మునుల వలలో చిక్కి కీలుబొమ్మలయ్యారు.

సునీథాదేవి : కుమారా! మరి తక్షణ కర్తవ్యమేమిటో వివరించి చెప్పు.

వేనుడు : ఈ ప్రపంచంలో నా పని పూర్తయ్యింది. నేనింక చేయదగింది యేమీ లేదు. పాపంలో కూరుకుపోయిన యీ లోకాన్ని ఏ బుద్ధుడో ఉద్ధరిం చాల్సిందే కాని సామాన్యులకు సాధ్యం కాదు. కనుక నీ కడుపున వేనుడు పుట్టలేదనుకో. పృథువే పుట్టాడనుకో!

సునీథాదేవి : వినకూడని మాటలు చెప్తున్నావు కుమారా! అలా చేయకు.

వేనుడు : అమ్మా నేను జీవించి వున్నంత వరకు మునుల ఆటలు సాగవని వాళ్లకు బాగానే తెలుసు. నన్ను అడ్డు తొలగించుకోజూస్తారు. పృథుకుమారుడు, ధృష్టవర్మ పదునుపెట్టిన కత్తుల్లా వాళ్ల చేతికి చిక్కారు. మునిపల్లె వైపుకు కన్నెత్తి చూడలేని వాళ్లు సైతం నేడటు పోతున్నారు.

సునీథాదేవి : కుమారా! ప్రతీకార ప్రయత్నం చేయవచ్చుగా? ప్రతివ్యూహం అయినా పన్నవచ్చుగా?

వేనుడు : నేను ప్రతీకారానికి పాల్పడను. పుణ్య పాపాలు తెలియని ప్రజలెందుకు చనిపోవాలి? నా కోసం వేలకొలది జనం ప్రాణాలెందుకు వదలాలి? నేను స్వార్థపరుణ్ణికాను. పదికత్తులు నాపైకెగిరినా నేను కత్తిముట్టను; కత్తి యెత్తను. నా ప్రజల్ని ఒకరిపై ఒకరిని వుసికొల్పి చంపుకొనేట్లు చేయను. అదంతా అసలు నేను చూడలేను.

సునీథాదేవి : కుమారా! ఆత్మరక్షణ కూడ అవసరం లేదా?

వేనుడు : ఈ శరీరం అశాశ్వతం తల్లీ! ఎవరైనా అసలు చావును తప్పించుకొన్న వాళ్లున్నారా? నిజంగా మునులు నన్ను హతమార్చాలని చూస్తే ఎంతకాలం నేను తప్పించుకొని తిరగగలను? దినదిన గండం నూరేళ్ళాయుష్షుగా నేను తిరగవలసిన పనేముంది? చనిపోయేంత వరకు నిర్భయంగానే తిరుగుతాను. నేటి నుండి నా గది తలుపులు తెరిచి వుంచాలనే నిర్ణయానికి వచ్చాను.

సునీథాదేవి : కుమారా! నీ వెంత ధర్మబద్ధంగా వ్యవహరించదలిచావు? నీ వంటి ప్రజ్ఞకలవానికి, పరోపకారికి కన్నతల్లి నయినందుకు ఆనందంగా వుంది.

వేనుడు : మాతృదేవీ! నా నాలోని మంచికి నువ్వేకదా మూలము. ఎవరెన్ని, ఆటంకాలు కల్పించినా నా ధర్మాన్ని నేను నెరవేర్చి తీరుతాను. ప్రొద్దుపోయింది. మీరు వెళ్లి నిద్రపోండి. పృథుకుమారుని మాత్రం కనిపెట్టి వుండండి.

సునీథాదేవి : కుమారా! నువ్వే లేని లోకంతో నాకేంపని? నువ్వు ధర్మాన్ని నిలబెట్టటాన్ని కన్నులార చూడాలని వుంది. లేకుంటే ఈ కన్నులు యింకేమీ చూడవు.

వేనుడు : అమ్మా! అలా అంటారేమి? మీరు అలా ఉదాసీనులైతే రాజ్యం అరాచకమైపోదూ? ప్రజాక్షేమం కోసం మీరు పాటుపడవలసిన అవసరం లేదా?

సునీథాదేవి : కుమారా! నేనేదో ఒక నిర్ణయానికి వచ్చేశాను. ఇంక నన్ను నువ్వేమీ బలవంతంగా మార్చవద్దు. చాలా పొద్దు పోయింది. నేనెళ్ళి నిద్రపోతాను. నీవుకూడ నిద్రపో.

వేనుడు : తల్లీ! అన్నీ తెలిసినదానివి. నీ యిష్ట ప్రకారమే కానిమ్ము.

సునీథాదేవి : నేనెళ్లివస్తా!

వేనుడు : చిత్తం! (సునీథాదేవి నిష్క్రమిస్తుంది; వేనుడు పచార్లు చేస్తూ) ఆర్య ఋషులెంతకు తెగించారు? ఇంత స్వార్ధమా? వీళ్లపై కత్తి దూసేందుకు నా మనస్సొప్పదు. నా స్వభావం తెలిసిన ధృష్టవర్మ వాళ్లకు మద్దతు పలుకుతూ వుండి వుండాలి. లేకుంటే ఋషులకు అంత సాహసం యెక్కడిది? విరోధుల్ని ఎదుర్కొని రాజ్యంలో శాంతి భద్రతలు క్షీణింప చేయలేను. నా పడకటింటి తలుపులన్నీ తెరిచే వుంచుతాను. ఈ రాత్రి హాయిగా నిద్రపోతాను. ఇటువంటి అవకాశం తిరిగి దొరుకుతుందో, దొరకదో. (పండుకుంటాడు)

(నిషాదుని ప్రవేశం – మూపున అమ్ములపొది; చేతిలో పదునైనకత్తి వేనరాజు గది ముందు మెల్లగా అటుయిటు తిరుగుతూ కావలి కాస్తుంటాడు. అడుగుల చప్పుడుకు వేనుడు ఉలికిపడి లేస్తాడు)

వేనుడు : ఎవరూ? నా పడక గదిముందు ఒంటరిగా తిరగటానికి కారణం ఏమిటి? ఓహో నిషాదా! నీవటయ్యా!

నిషాదుడు : అవును, నేనే, నిషాదుణ్ణి.

వేనుడు : ఎన్నాళ్ల కెన్నాళ్లకు ఊడిపడ్డావ్? ఎక్కడి నుండి రావటం? పిలవని పేరంటానికి వచ్చినట్లుగా వచ్చావే?

నిషాదుడు : మమ్మల్ని బొట్టు కాటుక పెట్టి పేరంటానికి పిలిచేవాళ్లెవరు? మేమేమయినా రాజులమా? నాగరికులమా?

వేనుడు : ఎప్పుడూ వేళాకోళాలేనా?

నిషాదుడు : పెద్దలతోగాక నేనెవరితో పరిహాసాలాడగలను?

వేనుడు : (ఎగాదిగా చూచి) ఈ వేళాకోళాలకేంగాని ఇదేం వేషం? యుద్ధానికి పోతున్నావా లేక అక్కడి నుండి తిరిగి వస్తున్నావా? జానెడు లేవు ఈ విల్లంబేమిటి? కత్తి యేమిటి? కాసెకోకదేనికి? ఏదో యుద్ధానికి సిద్ధమైవచ్చినట్లే వుంది.

నిషాదుడు : దేవా. యేలుకొనేందుకు రాజ్యాలిచ్చావా? కాపురం వుండేందుకు నగరాలిచ్చావా? అడవుల్లో నివశించే మాకు కత్తులు, కటారులు, కాసెకోకలు గాక మూటముల్లె లెక్కడి నుండి వస్తాయి?

వేనుడు : కుమారా! ఆ సూటీపోటీ మాటలెందుకు? నా మనస్సు గాయపరుస్తా వెందుకు? మీ అమ్మ కోరికమేరకే కదా అడవుల్లో మీ నివాసం.

నిషాదుడు : మన్నించండి. మీ మనస్సునొచ్చితే నేను చూళ్లేను.

వేనుడు : (ప్రేమతో చేయిపుచ్చుకొని) ఎక్కడి నుండి యీ రాక? చెప్పవా?

నిషాదుడు : ఎందుకు చెప్పనూ! హఠాత్తుగా వేటపైకి మనసు పోయింది. మునిపల్లె సమీపంలోని అడవిలో మచ్చల జింకలున్నాయని తెలిసి అటుగా పోతున్నాను.

వేనుడు : నీకు మచ్చల జింక మాంసమంటే అంతగా నోరూరుతుందా? అయితే పూర్వజన్మలో నువ్వు ఆర్య ఋషివి కాబోలు!

నిషాదుడు : నేనా? పూర్వజన్మ సంగతేమో కాని ఈ జన్మలో మాత్రం ఆర్యుల పొత్తు కుదిరింది. అందువల్లనే రెంటికి చెడిన రేవడినయ్యాను. అది సరే నేను పూర్వజన్మలో ఎందువల్ల ఆర్యఋషిని?

వేనుడు : ఆర్య ఋషులు పొడల జింక మాంసం అంటే లొట్టలేస్తారు. అది సరే బిడ్డా! నువ్వింకా మాంసం తినటం మానలేదా?

నిషాదుడు : మేము తినేదేమాంసం. మహారణ్యంలో షడ్రసోపేత భోజనం యెక్కడ దొరుకుతుంది? అయినా కన్నతండ్రి మాట జవదాటేందుకు మేమేమయిన ఆర్యులమా? ఆర్య యువతి కడుపున పుట్టిన వాళ్లమా? మూడేళ్లుగా మాంసం ముట్టలేదు. ఇదే మళ్లీ తొలిగా ఆ పాడుబుద్ధి పుట్టటం. అయినా నేను ఈ రోజు వేటకు పోయిందీ లేదు; మాంసం ముట్టిందీలేదు.

వేనుడు : ఎందువల్ల?

నిషాదుడు : అన్నిటికీ కారణాలుంటాయా? ఏ కారణమూ లేకుండా మనం యెన్ని పనులు చేయటం లేదు? వాటిల్లో యిదొకటి.

వేనుడు : ఏదో కారణం వుండేవుంటుంది; చెప్పు బిడ్డా చెప్పు.

నిషాదుడు : మునిపల్లె దాటి నాలుగడులు వేశానో లేదో మీ కట్టడి గుర్తుకురాగా గిరుక్కున వెనక్కి తిరిగి వచ్చాను. మిమ్మల్ని చూడాలనిపించింది. ఇలా వచ్చేశాను. అంతే.

వేనుడు : నువ్వు నిజాన్ని దాచే ప్రయత్నం చేస్తున్నావు. ఇటువంటి విద్యలు ఎక్కడ నేర్చావు? నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించే ఈ వాలకం నాకు నచ్చటం లేదు. వాస్తవాన్ని దాచి గూడలెగరేస్తావేమోయీ? ఈ చాలు ఎటునుండి వచ్చిందో!

నిషాదుడు : మీరు వూహించలేరా! ఇది కూడ నాతో చెప్పించాల్సిందేనా?

వేనుడు : ఊహించలేకపోతున్నాను.

నిషాదుడు : పెద్దలు చెప్తారుకదా మేనమామపోలిక, మేనత్త చాలికయని. తల్లిచాలు మాత్రం కాదు.

వేనుడు : నువ్వు చాలా దుందుడుకు బిడ్డవయ్యావోయీ! నిజంగా నన్ను చూడటానికే వస్తే చూచావుగా...యింక తిరిగి వెళ్లవచ్చుగా.

నిషాదుడు : కన్న తండ్రి యింటికి యెన్నాళ్ల తర్వాతో వచ్చాను. ఒక పూట వుండి పోగూడదా? ఈ రాత్రి మీ పడకగది ముందు జాగరణ చేయకూడదా?

వేనుడు : నా పడకగది ముందు జాగరణా? వద్దు. నాకు సేవకులు లేరనుకొన్నావా?

నిషాదుడు : మీకు సేవకులు ఎందుకుండరులే! నా వద్ద విల్లంబులు లేకుండా వుంటాయా? సేవకులు స్వామి ద్రోహులు కాకూడదు. ఆత్మరక్షణకు బాణములు పదునుగలవిగా వుండాలి. అయినా సేవకులపై గల నమ్మకాన్ని కన్న బిడ్డలపై వుంచలేరా? నేనా ఆటవికుణ్ణి. రాజ్యంతో, భోగభాగ్యాలతో నాకు పనిలేదు. ఎవ్వరేమన్న నేను ఈ రాత్రికి యిక్కడ మేలుకొనే వుంటాను.

వేనుడు : ఇంత మొండితనమేమయ్యా?

నిషాదుడు : తండ్రి పోలిక కాబోలు! విత్తన మొక్కటైతే చెట్టు యింకొకటెందు కవుతుంది!

వేనుడు : బిడ్డా! ధన్యుడవోయి. అంతా చేయిజారి పోయిందోయి. ఇప్పుడు నువ్వు చేయగలిగిందేమీ లేదు.

నిషాదుడు : తండ్రీ! వినరాని మాటలు వింటున్నాను. చేయిజారి పోవటమేమిటి? నా పొదిలో బాణాలున్నాయి. నా శరీరంలో వేడినెత్తురు వుంది. నా చేతిలో సత్తువవుంది. నా కత్తికి పదునువుంది.

వేనుడు : కుమారా! నీవు పసివాడివి. నీవు చేయగలిగిందేమిలేదు. నా మాటవిని వెళ్లిపో.

నిషాదుడు : ఇవన్నీ నిజంకావచ్చు. కానీ వీటిన్నింటినీ లెక్కచేయనిదొకటుంది.

వేనుడు : ఏమిటది?

నిషాదుడు : నిషాదునికి అవమానం తెలియదు. ఒకవేళ అవమానపడవలసి వస్తే ప్రాణాన్ని పణంగా పెట్టగలడు. ఇది జాతి లక్షణం.

వేనుడు : అయితే యివి నాకు తెలియని విషయాలా? అవి నాకు చెప్పవలసిన పనేముంది?

నిషాదుడు : నేను ఎందుకు వచ్చానో చెప్పమన్నారు గదా?

వేనుడు : నువ్వు మరి దానికి సమాధానం చెప్పావా?

నిషాదుడు : మా ఇళ్లల్లో ఎవరికయినా ఒకరికి అవమానం జరిగితే దానిని తప్పించటమో, లేదా భరించవలసివస్తే భరించే బాధ్యత కుటుంబం మొత్తానిది. ఎవరైనా హత్యచేస్తే మా కత్తులకు వాళ్ల రక్తం తాగించి తీరుతాం. పదునుగల మా కత్తులు ఆత్మరక్షణకు పెట్టింది పేరు.

వేనుడు : ఇంతగా వాదన యెందుకు?

నిషాదుడు : మీరు అడ్డుపడి అడిగినందువల్ల యింతగా చెప్పవలసి వచ్చింది. నా పని నన్ను చేసుకోనిస్తే ఈ మాటలతో పనే వుండేది కాదు.

వేనుడు : అడ్డుపడి నేనేమి అడిగాను?

నిషాదుడు : ఈ సమయంలో నేనిక్కడికి వచ్చిన దానికి కారణం?

వేనుడు : మరి కారణం చెప్పకుండ ఏవేవో మాట్లాడతావేం?

నిషాదుడు : మీరు నన్ను కారణం చెప్పనీయందే!

వేనుడు : సరే చెప్పు వింటాను.

నిషాదుడు : మా ఆటవిక ధర్మం ఒకటి నన్నిక్కడికి లాక్కొచ్చి రాత్రంతా మేల్కొని వుండమని చెప్తున్నది.

వేనుడు : ఏమిటా ఆటవిక ధర్మం?

నిషాదుడు : తండ్రిని రక్షించుకోవటం. అన్నింటికి అధినేత తండ్రే. ఒక్క అభిమానం తప్ప సర్వస్వాన్ని వెచ్చించి తండ్రిని కాపాడుకోవటం మా సంప్రదాయం, ఆచారం కూడ.

వేనుడు : (ఉలికిపడి, ఆనంద బాష్పములవల్ల కొంత సమయం మిన్నకుండి చివరకు తెప్పరిల్లి) కుమారా! ఇక ప్రశాంతంగా నేను ప్రాణాలు వదలగలనోయీ!

నిషాదుడు : నా శరీరంలో జీవం వున్నంతవరకు మీకు అటువంటి అవసరం వుండదులే. ధర్మం శాశ్వతం. శరీరం క్షణభంగురం. మా అమ్మ చిన్నప్పుడొక పాటనేర్పింది.

వేనుడు : ఏదీ ఆ పాట పాడు, వింటాను.

నిషాదుడు : నేను పాటలు పాడలేనే.

వేనుడు : నిషాదులలో బాణం వేయలేనివాడు పాటలు పాడలేనివాడు వుంటాడా?

నిషాదుడు : అయితే నేను నాకు చేతనయినట్లు పాడతాను.

పగవారు మనపైకి వచ్చిపడ్డారు
కోయంచు మనవూళ్లు కొల్లగొట్టారు
గూటిలో పిట్టల్ని కూల్చివైచారు
పొలములో పసిలేళ్ల పొడిచివైచారు

మరచి పోవద్దోయి మరచిపోవద్దు
మన జాతి యగచాట్లు మరచిపోవద్దు

గోచిపాతలు కట్టి క్రుంగి పొయ్యారు
నిదురపోనీకోయి నీ చేతికత్తి
త్రాగించు పగవారి రక్తంబునెపుడు

మరచి పోవద్దోయి మరచిపోవద్దు
మన జాతియగచాట్లు మరచిపోవద్దు

వేనుడు : గడచిన కాలం గుర్తుకొస్తున్నది బిడ్డా! ముంచుకొచ్చిన మరణాన్ని తప్పించలేవని నా మనస్సాక్షి చెప్తూంది.

నిషాదుడు : మనస్సాక్షి తరచుగా కూటసాక్షిగా మారుతుంది. తప్పించటం నా పని. అది సక్రమంగా జరక్కపోతే నా పీనుగమీద నుండే పగవాళ్ల కత్తి మీపైకి లేస్తుంది

వేనుడు : ఈ మాటలు నేను వినలేను. అమాయక ప్రజలు చనిపోతారనే భయంతో ఋషులపై దాడి చేయకుండ మరణానికి సిద్ధమయ్యాను. అటువంటి నాకోసం నీవు ప్రాణాలు పోగొట్టుకోవటం దేనికి?

నిషాదుడు : అంటు సొంటులేని ప్రజల క్షేమానికై మీరు మరణానికి సిద్ధమయ్యారు. మరి అంటు సొంటు గల నేను మీ కోసం ప్రాణాలు వదిలితే దోషమా?

వేనుడు : ఈ ప్రపంచాన్ని చూసి అసహ్యించుకుని దీనిని వదలదలచుకొన్న నా కోసం నీవు ప్రాణాలు వదలటం దేనికి?

నిషాదుడు : నేను మాత్రం యిక్కడ వుట్టిగట్టుకొని వూరేగుతానా? ఏదో ఒకరోజు చావు తప్పదుకదా? నా తల్లి నా చిన్నప్పుడే చనిపోయింది. నా అన్నవారు మీరు తప్ప నాకింకెవరున్నారు? మిమ్ములను కాపాడు కోగలిగితే పరమానందమే. లేదా మీలోకమే నాలోకము. ఈ రాత్రి హాయిగా నిద్రపొండి. జాగ్రత్తగా

నేను కావలికాస్తాను. నా ఆయుధాలు సామాన్యమైనవి కావు.

వేనుడు : ఆ విషయం నాకు తెలుసు. ఇంత ఆందోళనలో నిద్ర ఎలా పడుతుంది?

నిషాదుడు : తండ్రీ! మీ స్వభావం నాకు తెలియనిదా? వాన చినుకులకు గంభీరంగా వుండే సముద్రం అల్లకల్లోల మవుతుందా? హాయిగా నిద్రపొండి.

వేనుడు : కలలు వస్తాయి కలలో నువ్వే కన్పిస్తావు. నీ మాటలే విన్పిస్తాయి. నిద్రపోలేను

నిషాదుడు : మాటలొద్దు ప్రొద్దుపోయింది. నిద్రపొండి.

వేనుడు : కుమారా! నీ మాటలకు ఎదురు చెప్పలేకపోతున్నా. నీ తృప్తి కోసం ఏమయినా చేస్తా. ఇదిగో నిద్రించబోతున్నా (వేనుడు నిద్రిస్తూండగా నిషాదుడు గదిముందు కాపలా కాస్తుంటాడు. ధృష్టవర్మ, పృథుకుమారుడు ఖడ్గాలు ధరించి ఆవేశంగా వస్తూండగా–)

నిషాదుడు : ఎవరు, అర్ధరాత్రి రాజమందిరం లోపలికొచ్చేది?...ఓహో! ధృష్టవర్మ, పృథుకుమారులా? అయితే నేవిన్నది నిజమేనన్నమాట! ఆగండి అక్కడ! మహారాజు నిద్రిస్తున్నాడు. నిద్రా భంగమవుతుంది. మీకేం కావాలంటే అది నేను మీకు యిస్తాను. అలా కొంచెం దూరంగా వెళ్దాం రండి.

ధృష్టవర్మ : నిషాదా! నేనెవరినో తెలిసే యింత సాహసంతో మాట్లాడుతున్నావా?

నిషాదుడు : తెలియకేం...వేనరాజు సైన్యాధిపతివి. రాజును హత్య చేసేందుకు యువరాజును తోడు తెచ్చుకున్నావని తెలుసు. నువ్వు స్వామిద్రోహివి. అతడు పితృద్రోహి. ఈ అంతఃపురాన్ని అపవిత్రం చేయకుండ వెళ్లిపొండి.

పృథువు : నిషాదా! మే మెవ్వరిమో తెలిసికూడ ఎందుకలా ప్రేలతావు?

నిషాదుడు : మళ్లీ మాట్లాడితే నోరునొక్కేస్తా. మహారాజు లేవకముందే దూరంగా పోదాం పదండి.

ధృష్టవర్మ : మహారాజులేస్తే ఏమవుతుందేం? మమ్మల్ని భయపెట్టాలని చూడకు.

నిషాదుడు : ఆయనలేస్తే నన్ను మీతో కలబడనివ్వడు. కనుక నా కత్తి చురుకుదనం మీకు తెలియకుండా పోతుంది.

ధృష్టవర్మ : ఓహో! నువ్వా మహారాజును కాపాడేది?

నిషాదుడు : కాపాడలేకపోతే వీర స్వర్గాన్ని పొందుతాను. మీ వలె స్వామిద్రోహము, పితృద్రోహము తలపెట్టే నీచుణ్ణికాను. వెనక్కి తిరగరేం? మహారాజుకు మెలకువ వస్తుంది అవతలకు పొమ్మంటే పోరేం?

(విభ్రాంతులై ధృష్టవర్మ పృథుకుమారుడు ముందు నడుస్తూంటే నిషాదుడు వాళ్ల వెనుకనే పోతుంటాడు. తరువాత నెత్తుటితో తడిసి ముద్దయిన కత్తితో, శరీరం నిండా రక్తం మరకలతో ధృష్టవర్మ, పృథుకుమారుడు ప్రవేశిస్తారు.

ధృష్టవర్మ పెద్దకత్తితో వేనరాజు ఎదురు రొమ్ముమీద పొడువగా వేనరాజు కళ్లు తెరిచి అటు యిటు చూచి)

వేనుడు : ఓహో! నీవా ధృష్టవర్మా! ఆగిపోయావేం పనిపూర్తి చెయ్యి. చిన్నప్పటి నుండి పెంచి పెద్దచేసి ఎవరికీ లభించనంతగా అధికారాన్ని అప్పగించాను. దానికి ప్రతిఫలంగా నన్నిలా గౌరవించదలచావా? కానివ్వు. ఇదీ ఒకందుకు మంచిదే. ఏ ముని చేతులలోనే పడి చావకుండ కన్నబిడ్డ వంటి నీ చేతుల్లో మరణించటం మేలుకదా. ఇటువంటిది జరుగుతుందని నాకు చాలా కాలంనుండి తెలిసినా నీ పట్ల నాకున్న ప్రేమవల్ల ఏమీచేయదలవక వదిలేశా! (పృథువు వైపుచూచి) పృథూ! పృథూ! ఏడి నిషాదుడు? (ధృష్టవర్మ మళ్లీ పొడుస్తాడు)

పృథువు : నిషాదుడు కావాలా? నీకు దారి చూపేందుకు ముందుగా పంపివేశాం.

వేనుడు : నిషాదా! నిషాదా (హీన స్వరంతో పిలుస్తూ ప్రాణాలు వదుల్తాడు) (ధృష్టవర్మ రాజును అదేపనిగా వెఱ్ఱిచూపులతో చూస్తూ వుంటాడు. పృథువు తండ్రి పక్కకు వచ్చి తేరిపారజూచి ధృష్టవర్మ వెన్నుతట్టి)

పృథువు : ధృష్టవర్మా! ఏంటలా దిగాలు పడి చూస్తావేం? మనం చేయవలసిన పని పూర్తయ్యింది కదా. రాజు మరణించాడు. లోకం ఉపద్రవం నుండి విముక్తి పొందింది.

ధృష్టవర్మ : ఏమిటీ?! మహారాజు మరణించాడా? ఎంత ఘోరం! ఎంత ఘోరం! పాపిని, చండాలుణ్ణి, ఎంతఘోరం జరిగిపోయింది?

పృథువు : ధృష్టవర్మా! ఏమిటలా బెంబేలు పడతావు?! ఇంతగా పిరికిపంద వెప్పుడయ్యావు?

ధృష్టవర్మ : (వికటంగా) ఎప్పుడా! మునుల చేతిలో చిక్కినప్పుడు; యువరాజు స్నేహం చేసినప్పుడు. కుట్రలు పన్నటం మొదలు పెట్టినప్పుడు. ఇవ్వాల్టి నుండి నువ్వు మహారాజువు కాబోలు! ఈ మహారాజు ఔదార్యము నీకు తెలియదు. పెంచి పెద్ద వాణ్ణి చేసి సర్వసైన్యాధికారం నాకు అప్పగిస్తే నేనేం చేశాను? – పెద్ద పులిలా వేడి నెత్తురు గుటగుట త్రాగాను
(వేనరాజుపై బడి) మహారాజా! పల్కవేమయ్యా? నేను నిన్ను చంపివేశానా?

ఈ పాపి తోడు నీడగా లేకుండ ఎక్కడికైనా ప్రయాణము చేసి ఎరుగుదువా? ఎవ్వరో నా పీకబట్టి నులుముతున్నట్లున్నది.

గౌతముడు : (ప్రవేశించి, పరికించి చూచి) ఏమిటీ ధృష్టవర్మ పిచ్చివాడైపోయాడే! వేనుడి పట్ల ప్రేమ, భక్తి విశ్వాసాలు మెండు. ఇతనిని మావైపుకు తిప్పు కునేందుకు తలప్రాణం తోకకు వచ్చింది. ఎన్ని మాయమాటలు చెప్పాను? ఎన్ని అబద్ధాలాడాను. (పృథువు ప్రక్కకు చేరి) మహారాజా! ఏమిటలా చూస్తున్నారు? ధృష్టవర్మ పిచ్చివాడైపోయాడు. ఆ పిచ్చి తగ్గిపోతే మనకు పక్కలో బల్లెమవుతాడు. ఉండుండి యిప్పుడు నీ మీదికో, నా మీదికో దుముకుతాడు. ఇటువంటి ఉన్మాదస్థితిలోనే యితనిని చంపటం మంచిది. నావైపు ఎలా ఉరిమి చూస్తున్నాడో చూడు. అదిగో కత్తి దూస్తున్నాడు.

ధృష్టవర్మ : (వేనరాజు శవంపైనుండి లేచి) మహారాజా! నువ్వెక్కడికి వెళ్లినాసరే అక్కడికే వచ్చి మీకు సేవ చేస్తాను.

గౌతముడు : (పృథువుతో) మహారాజా! స్నేహితులను విడదీసి వుంచటం న్యాయంకాదు. పైగా ధృష్టవర్మ వేనమహారాజు వద్దకు సేవలు చేసేందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఆలస్యం చేయవద్దు. అదిగో అతడు కత్తిని తీస్తున్నాడు.

పృథువు : దేవా! భయపడకండి. మీకు ఆపద రాకుండ నేను కాపాడగలను

గౌతముడు : ఇంకేముంది! కత్తి పట్టుకొని లేవబోతున్నాడు.

పృథువు : గౌతమ మునీంద్రా! అతడు లేవకుండా కూల్చుతాను.
(తటాలున కత్తిదీసి ధృష్టవర్మ తల నరుకుతాడు).